Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in


సంపుటి : 2 సంచిక : 191 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 ఆగస్టు 2024 శుక్రవారం పేజీలు : 4

## యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతిసూదన్

న్యూఢిల్లీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) చైర్‌పర్సన్‌గా ప్రీతిసూదన్ నియమితులయ్యారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఉన్న ఆమె గురువారం ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రీతి సుదన్ 1983 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2020 జూలై వరకు మూడేళ్ల పాటు కేంద్ర ఆరోగ్య కార్యదర్శిగా ఆమె సేవలందించారు. కాగా, వ్యక్తిగత కారణాల వల్ల జూలై 4న యూపీఎస్సీ చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేశారు.




## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాష్ట్రాలు చేయొచ్చు




ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పును వెల్లడించింది. ఎస్సీల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలని సర్వోన్నత న్యాయ స్థానం తమ తీర్పులో చెప్పింది. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. SC వర్గీకరణ అంశంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో 3 రోజుల పాటు విచారణ జరిగింది. వర్గీకరణ సమర్థనీయమేనని నాడు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.. ఇవాళ నిర్ణయాన్ని వెల్లడించింది.. విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పును వెల్లడించింది.. దీనివల్ల ఎస్సీ ఎస్టీలోని వెనుకబడిన కులాలకు లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడింది. వర్గీకరణతో సమానత్వానికి భంగం వాటిల్లదని.. CJI చంద్రచూడ్ పేర్కొన్నారు. వర్గీకరణతో ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కుకు భంగం వాటిల్లదు.. వర్గీకరణ అనేది ఆర్టికల్ 341/2కి ఉల్లంఘన కాదు .. ఆర్టికల్ 15, 16లో వర్గీకరణ వ్యతిరేకించే అంశాలూ లేవని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రిమీలేయర్‌ను గుర్తించడానికి రాష్ట్రాలు.. ఒక నిర్దిష్టమైన విధానాలు తీసుకురావాలని.. జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. కాగా..వర్గీకరణపై EV చెన్నయ్య Vs స్టేట్ ఆఫ్ ఏపీ కేసులో.. 2 దశాబ్దాల క్రితం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కకుపెట్టింది.

**మంద కృష్ణమాదిగ భావోద్వేగం..** సుప్రీంకోర్టు తీర్పుతో మంద కృష్ణమాదిగ భావోద్వేగానికి గురయ్యారు.. మీడియా ఎదుట కంటనీరు పెట్టుకున్న మంద కృష్ణ.. తమ 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించిందంటూ పేర్కొన్నారు. కోటాలో సబ్‌కోటాపై సుదీర్ఘకాలంగా కోర్టులో కేసులు ఉన్నాయి.. ఈ క్రమంలో ఉపవర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ సుప్రీంను ఆశ్రయించింది.. పంజాబ్ ప్రభుత్వం సైతం వర్గీకరణపై సుప్రీంలో కేసు వేసింది.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంలో 3 రోజులు సుదీర్ఘ వాదనలు సైతం జరిగాయి. ఇదిలాఉంటే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్ మాదిగ విశ్వరూప సభలో ప్రధాని మోదీ సైతం వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, సుప్రీం కోర్టులో కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నాడు ప్రధాని మోదీ అన్నారు.



## మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ఆందోళన

హైదరాబాద్ : రాష్ట్రంలో వరుసగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. ఇంత జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇటీవల మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కేవలం 48 గంటల్లోనే సామూహిక అత్యాచారాలు, దాడులు సహా నాలుగు దారుణ ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ క్రూరమైన చర్యలు మహిళలకు తీవ్రమైన భద్రత లేకపోవడం, రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిని ఎత్తి చూపుతున్నాయన్నారు. ఎనిమిది నెలలు గడిచినా రాష్ట్రానికి హెూంమంత్రి లేకపోవడం, నేరాలు పెరగడం ప్రత్యక్ష ఫలితమే అని చెప్పుకొచ్చారు. వనస్థలిపురం, శాలిగౌరారం, నిర్మల్, పుప్పాలగూడలో జరిగిన దారుణ ఘటనలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్వర న్యాయం, దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## కేసీఆర్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందే కాంగ్రెస్



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. హరీష్‌రావును కూడా గతంలో మంత్రిగా కాంగ్రెస్ చేయలేదా..? అని ప్రశ్నించారు. గురువారం నాడు తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఉద్దండులైన న్యాయవాదులతో వాదించేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**వారిని నా సొంత అక్కలుగానే భావించా..** "బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను నేను నా సొంత అక్కలుగానే భావించా. సీతక్కపై సోషల్ మీడియాలో అవమానించేలా మీమ్స్ పెడుతున్నారు. ఆదివాసీ ఆడబిడ్డను అవమానించినట్లు కాదా..? సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా ఢిల్లీ వెళ్లి రాజకీయ ఒప్పందం చేసుకున్న నీచులు వారు. అక్కా మీరు వాళ్ల ఉచ్చులో పడొద్దు.

మీ ముందు కింద కూర్చో కూడదనే కేసీఆర్ సభకు రావడం లేదు. మైక్ ఇస్తే శాపనార్థాలు.. ఇవ్వకపోతే పోడియం దగ్గర నిరసనలు చేస్తున్నారు. నేను చెల్లెలు జైల్లో ఉంటే రాజకీయాల కోసం బజార్‌లో తిరిగేవాడిని కాదు. దొర పన్నిన కుట్రలో మా అక్కలు బందీ అయ్యారు" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**బీఆర్ఎస్ నేతలకు దేవుడు జ్ఞానం ప్రసాదించాలి..** "అక్కల క్షేమం కోరే చెబుతున్నా... వాళ్ల ఉచ్చులో పడొద్దు. దళిత బిడ్డలు సంతోషపడే రోజు వస్తే నిలబడాల్సిన అవసరం ఉంది. కానీ ప్రధాన ప్రతిపక్షం వాకౌట్ చేసి వెళ్లిపోయింది. అందుకే వాళ్ల నుంచి ఏమైనా ఆశిస్తే.. కుక్క తోక పట్టుకుని గోదారి ఈదినట్టే. వాళ్లకు దేవుడు జ్ఞానం ప్రసాదించాలని కోరుకుంటున్నా. సాయంత్రం స్కిల్స్ యూనివర్సిటీ భూమిపూజకు రావాల్సిందిగా అందరినీ కోరుతున్నా. బీఆర్ఎస్ నేతలకు రాజకీయ ప్రయోజనం తప్ప.. ప్రజల ప్రయోజనం పట్టదు. రైతు రుణమాఫీపై చర్చ జరగకూడదని బీఆర్ఎస్ నేతలు ఆడబిడ్డలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. స్కిల్స్ యూనివర్సిటీపై చర్చ జరగకూడదని అడ్డుకోవాలని చూస్తున్నారు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వర్గీకరణపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు..** మరోవైపు.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 23న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దామోదర రాజనర్సింహ అడ్వకేట్ జనరల్‌ను సుప్రీంకోర్టుకు పంపించా రని అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో న్యాయ నిపుణులతో వాదనలు వినిపించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

**మా ప్రయత్నం ఫలించింది..** తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఇప్పుడు అమల్లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్‌లో కూడా మాదిగ, మాల ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని అన్నారు. ఇందుకోసం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకువస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు.

## సీఎం రేవంత్‌తో పాటు అమెరికా వెళ్లేందుకు

# కాంగ్రెస్ నేతల తహతహ!

## కారణం ఏంటి?




హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనతో కాంగ్రెస్‌లో ఒక్కసారిగా హడావుడి మొదలైంది. సీఎం వెంట తాము కూడా విదేశీ పర్యటనకు వస్తామంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలంతా క్యూ కడుతున్నారట. నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే కలుస్తూ తమనూ అమెరికా తీసుకెళ్లాలని ప్రాధేయపడుతున్నారట. ఇలా సీఎం వెంట పడుతున్న వారిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలే ఎక్కువగా ఉన్నారంటున్నారు. పెట్టుబడుల కోసం సీఎం అమెరికా టూర్ వెళితే.. కాంగ్రెస్ నేతల హంగామా దేనికి అనుకుంటున్నారా?

**సీఎంతోపాటు అమెరికా వెళ్లేందుకు నేతల ఆసక్తి..** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్టు 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మొత్తం 12 రోజుల అధికారిక పర్యటన కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ అమెరికా టూర్ ప్లాన్ చేశారు. ముఖ్యమంత్రి వెంట ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో పాటు సంబంధిత అధికారులు వెళ్లనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సీఎంతోపాటు అమెరికా వెళ్లేందుకు చాలా మంది నేతలు ఆసక్తి చూపుతున్నారట. అందులో కొంతమంది మంత్రులతో పాటు ప్రభుత్వ సలహాదారులు, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇంకొంత మంది నాయకుల పేర్లు ఉన్నాయి.

సీఎంతో అమెరికా వెళ్తే స్వామికార్యంతోపాటు స్వకార్యం నెరవేర్చుకోవచ్చనే ఆలోచనతోనే ఎక్కువ మంది విదేశీ పర్యటనకు ఉవ్విళ్లూరుతున్నారన్న చర్చ జరుగుతోంది.

**సొంత ఖర్చులతోనైనా అమెరికా వచ్చేందుకు పర్మిషన్ ఇవ్వాలని విన్నపం..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందంలో అధికారికంగా అమెరికా పర్యటనకు వెళ్లేందుకు చాలా మంది లాబీయింగ్ చేస్తున్నారని తెలుస్తోంది. సీఎం ఇలా విదేశాలకు వెళ్లినప్పుడు ప్రొటోకాల్ ప్రకారం ఎంత మంది, ఏయే స్థాయిలో ఉన్న వారు వెళ్లవచ్చన్న వివరాలు ఆరా తీస్తున్నారు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు. ఒకవేళ ప్రొటోకాల్ ప్రకారం అధికారికంగా వెళ్లే అవకాశం లేకపోతే తమ సొంత ఖర్చులతోనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట అమెరికా వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు జీఏడీ అధికారులను కోరుతున్నారని సచివాలయ వర్గాల సమాచారం. మరికొంత మంది నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తాము కూడా అమెరికా వస్తామని, అనుమతించాలని అడుగుతున్నారట. దీంతో వారికి ఏం చెప్పాలో అర్థంకాక సీఎం మౌనం వహిస్తున్నారన్న చర్చ ప్రభుత్వ వర్గాల్లో నడుస్తోంది. గతంలో సీఎం హెూదాలో కేసీఆర్ విదేశీ పర్యటనలకూ వెళ్లినప్పుడూ ఇలానే పదుల సంఖ్యలో టూర్ చేసిన సందర్భాలున్నాయి. ఇదే రీతిన ఇప్పుడు కూడా సీఎం రేవంత్ తో వెళ్లేందుకు నేతలంతా తహతహలాడుతున్నారట.

**లాబీయింగ్ చేసుకోడానికి తగిన సమయమనే ఆలోచన..** మరీ ముఖ్యంగా క్యాబినెట్ బెర్త్ ఆశిస్తున్న నేతలు లాబీయింగ్ చేసుకో డానికి ఇదే సమయం అని భావిస్తున్నారట.. ఇక కార్పొరేషన్ పదవుల కోసం ప్రయత్నిస్తున్న ఆశావహులు సైతం రేవంత్ వెంట అమెరికా వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీగా ఉండటం వల్ల సమయం ఇవ్వడం లేదని, అమెరికాలో కొంత టైం దొరికే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే ఎక్కువ మంది నేతలు అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు.

**సొంత ఖర్చులతో సీఎం వెంట వెళ్లేందుకు 15 మంది ఎమ్మెల్యేల ఆసక్తి..** సీఎం రేవంత్ వెంట పరిమిత సంఖ్యలోనే ప్రోటోకాల్ పరిమితులకు లోబడి 20 నుంచి 22 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీంతో సొంత ఖర్చులతో సీఎం వెంట వెళ్లేందుకు సుమారు 15 మంది ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న ఆశావహులు ఫ్లైట్ టిక్కెట్లు బుక్ చేసుకున్నారని సమాచారం. సీఎం అనుమతిస్తే మరికొంత మంది సైతం ఒకట్రెండు రోజులు అటు.. ఇటుగా అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్నారన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. ఏదేమైనా సీయం రేవంత్ టూర్ తో తెలంగాణ కాంగ్రెస్ నేతలంతా అమెరికాలో చక్కర్లు కొట్టేందుకు ప్లాన్ చేస్తుండటమే ఇప్పుడు ఆసక్తిరేపుతోంది.

## సంపాదకీయం

# మావోలకు మన్యంలో పట్టు పోతోందా ?

మావోయిస్టులు అంటే హడలెత్తిన మన్యంలో మార్పు వస్తోందా. దీనిని చైతన్యానికి సూచికగా చూడాలా అన్న చర్చకు ఆస్కారం ఇచ్చే సంఘటన ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి మాడుగుల మండలంలో మావోయిస్టులు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే మావోలు నిర్వహిస్తున్న వారోత్సవాలు వ్యతిరేకంగా గళం విప్పింది పోలీసులు కాదు, ప్రజా సంఘాలు కాదు, సాధారణ విద్యార్థులు. ఈ జిల్లాలోని పాడేరు నియోజకవర్గం జి మాడుగుల వారపు సంతలో సాధారణ ప్రజలు కాలేజీ విద్యార్థులు కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. మావోలకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. అన్ని ప్రాంతాలతో సమానంగా మన్యం అభివృద్ధి కావాలని వారు కోరుకున్నారు. మావోల వల్ల మన్యం అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు. మావోలు నిజంగా మన్య ప్రాంతాల అభివృద్ధి గురించి ఆలోచిస్తే రోడ్లు గురించి రవాణా సౌకర్యం గురించి కమ్యూనికేషన్ గురించి మంచినీటి సౌకర్యం గురించి స్థానిక ప్రజలకు సహకరించి ఆ దిశగా పోరాటం చేయాలని కోరారు. అంతేగాని అభివృద్ధి పథంలో నడుస్తున్నప్పుడు దానికి అడ్డుకోవద్దని వారు విజ్ఞప్తి చేశారు. మావోలకు మన్యం మీద ప్రేమ వింటే దేనికీ అడ్డుపడవద్దని ఈ ర్యాలీ సందర్భంగా విద్యార్థులు మావోలకు హితవు పలికారు. ప్రభుత్వాలు ప్రజలకు మంచి చేసే విధంగా అభివృద్ధి గురించి ఆలోచిస్తున్నప్పుడు రోడ్లు వేస్తున్న వారిని ఇబ్బంది పెట్టడం, అలాగే కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టడం, కమ్యూనికేషన్ వ్యవస్థను సెల్ టవర్లను ధ్వంసం చేయడం సరి కాదని ఈ ర్యాలీ సందర్భంగా విద్యార్థులు అంటున్నారు. ఒక విధంగా చూస్తే మావోలకు మన్య ప్రాంతాలలో మద్దతు క్రమంగా తగ్గిపోతోంది. ప్రజలు గతం కంటే మెరుగు అయ్యారని అంటున్నారు. అక్కడా స్మార్ట్ ఫోన్లు వచ్చేశాయి. ప్రపంచంలో ఏమి జరుగుతోంది అన్నది తెలుస్తోంది. నిజంగా అన్యాయమే జరిగితే దానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రపంచంలో చాలా మంది ఎంచుకుంటున్న మార్గాలని కూడా ప్రజలు గమనిస్తున్నారు. తుపాకీలు తూటాలతోనే ఏదీ పరిష్కారం కాదని కూడా వారు గ్రహిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు కూడా గతానికి భిన్నంగా మన్యంలో పట్టు పెరిగింది. ఇక రేపటి యువతగా భావిస్తున్న విద్యార్థులతో ర్యాలీలని నిర్వహించడం ద్వారా మావోలకు ఉన్న పట్టుని పూర్తిగా తగ్గించాలన్నదే అధికారులు పోలీసుల ఆలోచనగా ఉంది. ఏది ఏమైనా మన్య ప్రాంతాలు జిల్లాలుగా మారడంతో పాలన మరింత దగ్గరకు వచ్చింది. ఇదే విధంగా సాగితే మాత్రం మావోలు తమ ఆలోచనలను తమ పోరాట పంథాను కూడా మార్చుకోక తప్పదని అంటున్నారు.

# మిన్నంటిన సంబరాలు



శామీర్ పేట, (గరుడ వార్త) : ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడంతో మండల కేంద్రం మూడు చింతలపల్లిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాల కిందట 11 మందితో ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ నేడు లక్షలాదిమందితో మాదిగల సమస్యలపై పోరాడుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ ముఖ్య లక్ష్యాన్ని నేడు చేరుకోవడం గర్వించ దగ్గ విషయమని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమ కృషి ఫలించిందన్నారు. టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెర్రీపోతుల నరసింహులు, కేశపురం మాజీ సర్పంచ్ ఇస్తారి, అద్రాస్ పల్లి మాజీ ఉపసర్పంచ్ జహంగీర్, కొల్తురుమాజీ సర్పంచ్ శిల్ప యాదగిరి, నాయకులు నవీన్, మాదిగ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి విజయ్, పారుపల్లి ఎల్లం, కొమ్ము నరేష్, నర్సింలు, ఇరుమయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం సేవచేసేవారికి దైవానుగ్రహం ఎల్లవేళలా లభిస్తోంది : ఈటెల జమున

### తూముకుంట మున్సిపల్ పోతాయపల్లి పరిధిలోని శ్రీరామ భద్ర క్షేత్రంలో అయోధ్య సంకల్ప సైకిల్ యాత్రను ప్రారంభించిన ఈటెలజమున



శామీర్ పేట, (గరుడ వార్త ) : నిరంతరం ప్రజల కోసం పనిచేసేవారికి ఎల్లవేళలా దైవానుగ్రహం లభిస్తోందని ఈటల జమున అన్నారు. గురువారం తూంకుంట మున్సిపల్ పోతాయిపల్లి పరిధిలోని శ్రీరామభద్రక్షేత్రం నుంచి బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయోధ్యకు వెళ్ళే సంకల్ప సైకిల్ యాత్రను ఈటెల జమున జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ యాత్ర దిగ్విజయం అయ్యేందుకై శ్రీరామభద్ర క్షేత్రంలో వేద బ్రహ్మణుడు పండరీ సంతోష్ కుమార్ ప్రత్యేక పూజలను, హెూమాలను పెద్ద ఎత్తున మంత్రోశ్చరణలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల జమున మాట్లాడుతూ 4 లక్షల మెజార్టీతో ఎంపీ గా ఈటల రాజేందర్ గెలుపొందితే బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సైకిల్ యాత్రను నిర్వహిస్తామని ఇక్కడి శ్రీరామభద్ర క్షేత్రంలో మొక్కుకున్నట్లు తెలిపారు.దైవానుగ్రహంతో, ఆశీస్సులతో తన భర్త ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో ఎం పీగా గెలుపొందినట్లు ఆమె తెలిపారు. ప్రజలకు సేవ చేసేవారికి ఎల్లప్పుడు భగవంతుడి అనుగ్రహంతో, ఆశీస్సులతో ఉన్నత స్థానంలోకి ఎదుగుతారని ఆమె వివరించారు. మల్కాజ్గగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రజల సహకారంతో, భగవంతుని ఆశీస్సులతో రాజకీయాలకతీతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పనులను చేపట్టడమే ఎంపీ ఈటల రాజేందర్ ధ్యేయమని ఆమె వెల్లడించారు. బీజేపీ కార్యకర్తలు చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం కావాలని శ్రీరామ భద్రున్ని వేడుకుంటున్నట్లు ఆమె తెలిపారు. కాగా తూంకుంటకు చెందిన బీజేపీ కార్యకర్తలు కాసుల కరుణాకర్ గౌడ్, కాసుల సుభాష్ చంద్రబోస్ గౌడ్, రాజారెడ్డి, హుజురాబాద్ కు చెందిన మరో ఇద్దరు పార్టీ కార్యకర్తలు సంకల్పయాత్రగా సైకిళ్ళపై తూంకుంట నుంచి అయోధ్యకు బయలుదేరారు. 15 రోజుల నుంచి 20 రోజుల వరకు ఈ అయోధ్య సంకల్పయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని అయోధ్యలోని శ్రీరాముని దర్శించుకుని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసుల నర్సింగ్ రావుగౌడ్, కాసుల ఈశ్వర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చినుకు పడితే.. వణుకే!



పరిగి : వానాకాలం ప్రారంభం అవుతుందంటేనే జిల్లా పట్టణ ప్రాంత వాసులు 'గతానుభవాల వరద ముప్పు' తలుచుకుని వణికిపోతున్నారు. చిన్నపాటి వర్షం పడినా వరదనీరు నేరుగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వచ్చేస్తోంది. కొన్నిచోట్ల నీరుపారే కాలువలు సరిగ్గా లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వర్షాలు ఇప్పుడిప్పుడే పడుతున్నాయి. మళ్లీ ప్రజలు అవస్థల పాలు కాకుండా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై 'పరిశీలనాత్మక' కథనం.

**దశాబ్దాల క్రితం నిర్మించినవి...**

పరిగిలోని టీచర్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఖాన్ కాలనీల కంటే బీసీ కాలనీ పల్లపు ప్రాంతంగా ఉంది. వర్షపు నీరంతా సాఫీగా వెళ్లకపోవడం, ఎక్కువ లోతుగా ఉండటంతో నీరంతా అక్కడే నిలుస్తోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగు కాల్వలు పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా చాలకపోవడం, పలుచోట్ల దెబ్బతినడంతో నీరంతా నేరుగా ఇళ్లలోకి చేరి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. బీసీ కాలనీ రోడ్డు ఎంతపెంచడంలేదు.

**సమస్య వచ్చినప్పుడే గుర్తుకొస్తుంది**

జిల్లాలో వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి పురపాలక సంఘాలున్నాయి. వీటిలో తాండూరు, వికారాబాద్ పాతవి కాగా, మిగిలినవి ఏడేళ్ల క్రితం ఏర్పడినవి. భారీ వర్షాలతో వరదలు వచ్చి కాలనీలు ముంపునకు గురవుతున్న సమయంలోనే నేతలకు సమస్య గుర్తుకొస్తోంది. ఆ తరువాత మళ్లీ పట్టించుకోవడం లేదు.

వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రిక్షా కాలనీ, రామయ్య గూడ కాలనీ, గరీబ్‌నగర్, గృహకల్ప తదితర ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షం పడినా చాలు ప్రజలు హడలి పోవాల్సిందే. రాజీవ్ గృహకల్పలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పురపాలిక పరిధిలో నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండటంతో పారిశుద్ధ్య వ్యవస్థకు తీవ్ర విఘాతంగా మారుతోంది.

**పాటు కాలువను పట్టించుకునే వారేరీ..**

బాలాజీనగర్ కాలనీలో గల కుమ్మరివాడలో గత సంవత్సరం వర్షం నీరు ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ఇంట్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, బియ్యం, జొన్నలు, రూ.లక్షల విలువైన కుమ్మరికుండలు ఇతర సామగ్రి పాడయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం ఈ కాలనీ దూరంగా పెద్ద చెరువుకు వెళ్లే పాటుకాలువ తెగిపోవడం. దీంతో ఇళ్లు నీటమునిగాయి. అప్పట్లో కుమ్మరివాడలో నష్టపోయిన వారికి ఇళ్లు, నష్ట పరిహారం అందిస్తామని చెప్పి నేటికీ నెరవేర్చలేదు. అలాగే గాంధీనగర్‌లోని కొన్ని కాలనీల్లో మురుగు కాలువలు నిండి ఇళ్లలోకి మురుగు వస్తోందని పలుమార్లు గాంధీనగర్ వాసులు అధికారులకు తెలిపినా స్పందన కరవైంది.

**వాగులను తలపించే రోడ్లు**

తాండూరు పట్టణంలో వర్షం వస్తే పరిస్థితి వర్ణించలేం. భారీ వర్షం కురిస్తే తాండూరులోని కొన్ని కాలనీలు జలమయమవుతున్నాయి. వర్షం నీరు వెళ్లే దారి లేక రోడ్ల మీద వరదలా పారుతూ ఇళ్లలోకి చేరుతుంది. ప్రధానంగా పట్టణంలోని మిత్రానగర్, గ్రీన్‌సిటీ, అయ్యప్ప నగర్, భవానీనగర్, ఆదర్శ తులసీ నగర్ కాలనీలను వర్షం నీరు పెద్ద ఎత్తున ముంచెత్తుతుంది. ఆయా కాలనీల్లో మురుగు కాల్వల వ్యవస్థ సక్రమంగా లేక పోవటంతో వర్షా కాలంలో వరద ముప్పు తప్పడంలేదు.రోడ్ల మీద వరద నీరు పారి వాగులను తలపిస్తుంది. ఇళ్ల ముందు నిలిపిన వాహనాలు నీళ్లలో మునిగి పోతాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది.

**ఇవీ కారణాలు..**

అస్తవ్యస్తంగా అంతర్గత రహదారులు.

శిథిలావస్థకు చేరిన మురుగు కాల్వలు.

చెత్తా, చెదారంతో పేరుకున్నా శుభ్రం చేయకపోవడం.

కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోవడం.

# నకిలీ కన్సల్టెన్సీల నయామోసాలు

హైదరాబాద్: ఇంజినీరింగ్ పూర్తయి మూడేళ్లు దాటింది. మిత్రుడి సలహాతో కూకట్‌పల్లిలో కన్సల్టెన్సీను సంప్రదించాడు. ప్రముఖ కంపెనీలో పోస్టింగ్ ఇప్పిస్తాం.. హెచ్ఆర్‌ను దారిలోకి తెచ్చేందుకంటూ రూ.60వేలు తీసుకున్నారు. ఐదు నెలలైనా స్పందన రాకపోవటంతో నిలదీశాడు. అప్పట్నుంచి దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరింపు. ఏం చేయాలో పాలుపోక మధ్యవర్తి ద్వారా రూ.25వేలు రాబట్టుకొని వెళ్లిపోయాడు. అమీర్‌పేట్‌లోని ఓ శిక్షణ సంస్థ రెండేళ్లు అనుభవం ఉన్నట్టు ఒక యువకుడికి నకిలీ పత్రం సమకూర్చింది. దాని ద్వారా కొలువు సంపాదించిన అతడి పనితీరుపై అనుమానం వచ్చిన సంస్థ విచారణ చేయిస్తే వాస్తవం వెలుగు చూసింది. ఆరు నెలలుగా ఆ యువకుడు తీసుకున్న వేతనం తిరిగి చెల్లించాలని.. లేకుంటే కేసు నమోదు చేస్తామని చెప్పటంతో నగదు కట్టి బయటపడ్డాడు. బాధితుడికి నకిలీ సర్టిఫికెట్ ఇచ్చినందుకు ఆ కన్సల్టెన్సీ అతడి 4 నెలల వేతనం తీసుకోవడం కొసమెరుపు.

నెలలు.. ఏళ్లు తరబడి ఎదురుచూసిన యువత ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో కనిపించే ఉద్యోగ ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మోసపోయి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్లలో ఏటా 500–600కు పైగా ఉద్యోగం/ఉపాధి అవకాశాల మోసాల కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది 5నెలల వ్యవధిలోనే 200లకు పైగా ఫిర్యాదులు వచ్చినట్టు గణాంకాలు చెబుతున్నాయి. తాజాగా ఎస్సార్‌నగర్ పరిధిలో ఒక ప్రయివేటు సంస్థ శిక్షణ ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతను ఆకట్టుకుంది. పలువురు యువకులు రూ.50–60వేలు చెల్లించి 6 నెలల శిక్షణ పూర్తిచేశారు. ఏడాదికి రూ.2–3లక్షల ప్యాకేజీతో కొలువు పక్కా అని లెక్కలు వేసుకున్నారు. వీళ్లు శిక్షణలో ఉండగానే సంస్థ



ప్రతినిధులు వీరి పేర్లతో క్రెడిట్‌కార్డులు/వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. ఈ సొమ్మును తాము వాడుకొని ఉద్యోగాల్లోకి చేరగానే వారి ఖాతాల్లో జమచేస్తామని నమ్మించారు. తరువాత ముఖం చాటేయటంతో బ్యాంకుల నుంచి యువతకు నెలవాయిదాలు చెల్లించాలంటూ నోటీసులు అందటం మొదలైంది. మోసపోయినట్టు గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నకిలీ సంస్థ వెబ్‌సైట్‌ను అంతర్జాలం నుంచి తీసివేయించారు.

**కాస్త ఆగమంటూ వాయిదాలు**

గతేడాది అమెరికా, ఇంగ్లండ్‌లో నకిలీ కన్సల్టెన్సీ 150మంది యువకుల నుంచి రూ.2.5కోట్లు కాజేసి ముఖం చాటేసింది. తాజాగా సికింద్రాబాద్ పరిధిలో ఒక కన్సల్టెన్సీ విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన సర్టిఫికెట్లు, పాస్ట్‌పోర్టు, వీసా సమకూర్చుతామంటూ ఒక విద్యాసంస్థకు రూ.3కోట్లకు టోకరా వేసింది. రెండేళ్లుగా ప్రాంగణ ఎంపికలు జరగట్లేదు. కార్పొరేట్ సంస్థలు కూడా నియామకాలు చేపట్టడం లేదు. వందశాతం ఉద్యోగాలంటూ శిక్షణ సంస్థలు రేపుమాపంటూ వాయిదాలేస్తున్నాయి. యువత నకిలీ సర్టిఫికెట్లతో ఏదో కంపెనీలో చేరుతున్నారు. పనితీరు సరిగా లేకపోవటంతో దొరికిపోతున్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో కదలిక వచ్చేనా?

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రామగుండం నగరపాలికలు, 14 పురపాలికలు, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్–2020 దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. 2020 అక్టోబరు 31 వరకు గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తులు స్వీకరించారు. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 1,13,346 దరఖాస్తులు వచ్చాయి. అందులో 702 అర్జీలు మాత్రమే పరిష్కరించి, అనుమతులు జారీ చేశారు. ఫీజు చెల్లించాలని కోరుతూ 8,796 మందికి లేఖలు పంపించారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. కరీంనగర్ సుడాలో 21,042 దరఖాస్తులు రాగా, 654 పరిష్కారానికి ఉండగా అయిదింటికి అనుమతులు ఇచ్చారు. వేములవాడ వీటీఏడీఏలో 3,873 అర్జీలు రాగా 183 పరిష్కారంలో ఉండగా ఇప్పటివరకు ఒక్క దానికి కూడా అనుమతి జారీ చేయలేదు. పర్యవేక్షణ నామమాత్రం..ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి జిల్లాకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. పురపాలికల్లో పట్టణ ప్రణాళిక



అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దరఖాస్తులను వేగంగా పరిశీలించాల్సి ఉండగా ఇతర విధుల కారణంగా అధికారులు అందుబాటులో ఉండటం లేదు. కొందరు ఫీజులు చెల్లిస్తామని, మరికొందరు చెల్లించిన వారు కార్యాలయాల వెంట తిరుగుతున్నారు. 24,267 దరఖాస్తులను ప్రాసెసింగ్ చేయగా వాటికి ఫీజు నిర్ణయించి అనుమతి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే దరఖాస్తులు పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాల్సిన అవసరముంది.అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని ఈనెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గడువు విధించగా సార్వత్రిక ఎన్నికల కారణంగా మళ్లీ మొదటికొచ్చింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, దరఖాస్తుదారులు మొదట్లో ఉత్సాహం చూపించారు. ప్రస్తుతం సమాచారం ఇచ్చినా కొందరు స్పందించడం లేదు. ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల పరిస్థితిపై కథనం.

# పంపిణీకి తాత్సారం.. కట్టినా నిరుపయోగం

తాండూరు : పేదల కలల గూడు సాకారం చేసేందుకు సర్కారు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. పూర్తయిన ఇళ్ల కేటాయింపులకు దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత పంపిణీ గురించి పట్టించుకోలేదు. రూ.కోట్లు ఖర్చు చేసిన ఇళ్ల సముదాయాలు ఏడాదిన్నర నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ పరిస్థితి తాండూరు నియోజకవర్గంలో నెలకొంది. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

**1200 గృహాలకు 800కుపైగా పూర్తి**

తాండూరు నియోజకవర్గంలో తొలిసారిగా 2018లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తాండూరు మండలం ఖాంజాపూర్ గేటు వద్ద విశాలమైన ప్రభుత్వ స్థలంలో 1,200లకుపైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో దాదాపు 800 ఇళ్ల నిర్మాణాలు 2023లో పూర్తయ్యాయి. తలుపులు, కిటికీలు అమర్చారు. విద్యుత్, తాగునీటి కనెక్షన్లు అమర్చారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. ఇళ్ల సముదాయాలకు మధ్య విశాలంగా రహదారులు నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేశారు.

**మొత్తం 9,956 దరఖాస్తుల స్వీకరణ**

పూర్తిచేసిన ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించేందుకు అధికారులు గతేడాది దరఖాస్తులు స్వీకరించారు. పట్టణ వాసులతోపాటు పట్టణంలోని అద్దె ఇళ్లల్లో ఉంటున్న గ్రామీణ ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. మొత్తం 9,956 దరఖాస్తులు అందడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పదికిపైగా బృందాలు నేరుగా దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి దరఖాస్తు పత్రాల్లో పేర్కొన్న వివరాలు సరైనవా కాదా అని విచారించారు. ఉద్యోగ, ఉపాధి, కుటుంబ సభ్యుల సంపాదన, స్థిర, చర ఆస్తులు గురించి ఆరా తీశారు. వడపోత ప్రక్రియ నిర్వహించి 6,000 మందిని అర్హులుగా తేల్చారు. వీటిలో మరింత మంది అర్హులను గుర్తించేందుకు జాబితాను జిల్లా



పాలనాధికారి కార్యాలయానికి పంపించారు. ఆధార్, బ్యాంకు వివరాల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో అర్హులను గుర్తించారు. ఇళ్ల పంపిణీపై నేడు, రేపు అంటూ కాలయాపన చేశారు.

**గుర్తింపు ప్రకియ వృథా..**

అసెంబ్లీ ఎన్నికలు రావడంతో దరఖాస్తులు బుట్టదాఖలయ్యాయి. అధికారుల విచారణ, లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ వృథాగా మారింది. మరోవైపు తాండూరు–హైదరాబాద్ జాతీయ రహదారి వారగా ఇళ్ల సముదాయ భవనాలు అలంకారప్రాయంగా మారాయి. వృథాగా ఉంచిన ఇళ్ల మధ్యన పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అపరిశుభ్రంగా మారుతున్నాయి. కళ్ల ముందు అధునాతన హంగులతో ఇళ్లు ఉన్నప్పటికీ పేదలు ఇరుకైన అద్దె గదుల్లో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. రెక్కలు ముక్కలు చేసుకుంటే వచ్చే సంపాదనలో నెలనెలా అద్దె పేరిట రూ.3వేల నుంచి రూ.6వేలు చెల్లించాల్సి రావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే అర్హులైన ఇల్లులేని పేదలకు రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలని కోరుతున్నారు.

# మత్తుదారులు మూసేలా టీజీన్యాబ్

కరీంనగర్ : యువతను నిర్వీర్యం చేస్తున్న మత్తును వదిలించేందుకు పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. పబ్‌లలో మాదిరి పాఠశాలస్థాయిలో ఈ–సిగరెట్ల దమ్ముకు అలవాటుపడిన పిల్లల మత్తు వదిలించేందుకు నిఇరంతరం నిఘా పెడుతున్నారు. కిక్ కోసం సింథటిక్ డ్రగ్స్ వినియోగించేంత వరకూ వెళ్లిన విషయాన్ని గుర్తించారు. 12 విద్యాసంస్థల్లోకి మత్తుపదార్థాలు చేరినట్టు పక్కా ఆధారాలతో నిరూపించిన పోలీసులు ఇప్పుడు మత్తు దారులు మూసేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాదకద్రవ్యాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్రం నలువైపులా పోలీసులు, ఎక్సైజ్, నార్కొటిక్స్ బ్యూరో ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) రంగంలోకి దిగి విద్యాసంస్థలు, ఐటీ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో అకస్మికంగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

కళాశాలలపైనా కన్ను..ఎవరూ గమనించరనే భరోసా. పలుకుబడితో బయటపడగలమనే ధీమాతో గంజాయి, కొకైన్, హెరాయిన్, ఎండీఎంను విచ్చలవిడిగా వినియోగించేవారి భరతం పట్టనున్నారు. ఇప్పటికే రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందినవారిని గుర్తించి కేసు




నమోదుచేసిన టీజీన్యాబ్ బృందాలు.. కళాశాలలను కూడా చుట్టేయనున్నారు. అకస్మిక తనిఖీలు చేసి విద్యార్థులను పరీక్షిస్తారు. గంజాయి వినియోగించే వారిలో 4 వారాలు, కొకైన్, హెరాయిన్ వంటి సింథటిక్ డ్రగ్స్ తీసుకునేవారి శరీరంలో 3 నెలలు ఆ అనవాళు ఉంటాయి. డ్రంకన్‌డ్రైవ్ తరహాలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు. పబ్‌లలో స్నిఫర్‌డాగ్స్‌తో తనిఖీలు చేపడుతున్నారు. తమ వద్దనున్న కిట్స్‌తో వేడుకల్లో పాల్గొన్న వారి మూత్ర నమూనాలు తీసుకొని క్షణాల్లో డ్రగ్స్ తీసుకున్నారా! లేదా! అని నిర్ధారించి కేసులు నమోదు చేస్తారు. నిరంతరం తనిఖీలు.. సిలబస్ పూర్తిచేయటం, మార్కులు, ర్యాంకులపై శ్రద్ధ చూపుతున్న నిర్వాహకులు విద్యార్థుల కదలికలను పసిగట్టలేకపోతున్నారని సైబరాబాద్‌కు చెందిన పోలీసు అధికారి ఒకరు తెలిపారు. బోధనా సిబ్బందితో పాటు తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేసి విద్యార్థుల భవితను బంగారం చేసే పనిలో పోలీసులున్నారు. రాజస్తాన్, ముంబయి, గోవా, బెంగళూరు నుంచి ప్రయివేటు బస్సులు, కొరియర్ సంస్థల ద్వారా నగరానికి డ్రగ్స్ చేరుతున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఎప్పుడు.. ఎవరిపై దాడి చేస్తారో అంచనా వేయడానికి అంతుపట్టని విధంగా తనిఖీలుంటాయని పోలీసులు చెబుతున్నారు. ట్రావెల్స్ నిర్వాహకులు, కొరియర్ సంస్థలకు టీజీన్యాబ్ మార్గదర్శకాలు జారీ చేసింది. ఏదైనా అనుమానాస్పద వస్తువులు గుర్తిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చేలా వారికి అవగాహన కల్పిస్తున్నారు.

# దేవాదాయ శాఖలో బదిలీల ఉత్కంఠ



కరీంనగర్ : దేవాదాయ శాఖలో బదిలీల ఉత్కంఠ నెలకొంది. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి కొన్ని ఆలయాలను అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో రావాలని ఉన్నతాధికారుల నుంచి పిలుపు రావడంతో దేవాదాయ శాఖ కార్య నిర్వహణాధికారులు సోమవారం హైదరాబాద్‌కు వెళ్లారు. దశాబ్దకాలంగా ఒకే చోట పని చేస్తున్న కొందరు ఉద్యోగులకు స్థానచలనం జరిగే అవకాశాలున్నాయి. మొదట రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ఉద్యోగులతోపాటు అర్చకులకు కూడా బదిలీ చేయాలని భావించింది. వారి నుంచి వ్యతిరేకత రావడంతో ఆ అంశాన్ని పక్కన పెట్టింది. ఉమ్మడి జిల్లా ఆలయాలన్నీ సహాయ కమిషనర్ పరిధిలో ఉన్నాయి. నిబంధనల ప్రకారం కాలపరిమితి ముగియడంతో ఆ పోస్టు అధికారి బదిలీ తప్పదని తెలుస్తోంది. సహాయ కమిషనర్ కూడా బదిలీకి అర్జీ పెట్టుకున్నట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఎవరు వస్తారనేది ఉత్కంఠగా మారింది. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసి పక్క జిల్లాలో ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్‌గా పని చేస్తున్న వారికి లేదా గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్‌గా పనిచేసిన అధికారుల్లో ఎవరో ఒకరికి ఆ స్థానం దక్కే అవకాశముంది. ప్రస్తుత సహాయ కమిషనర్ కొండగట్టు దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవోగా పని చేస్తున్నారు. అయితే కొండగట్టుకు హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో పని చేస్తున్న ఒక అధికారికి బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

**ఇబ్బందులు తొలగేనా?**

ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీలు చేపట్టే విధంగా ఉద్యోగుల దరఖాస్తులు స్వీకరించారు. మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న ఉద్యోగులు వారికి అనువైన ప్రాంతాలు దక్కేనా అని ఎదురు చూస్తున్నారు. ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి చేయడంతో అక్రమాలు వెలుగుచూస్తున్నాయనే అభిప్రాయాలున్నాయి. మార్పులు చేర్పులు జరిగితేనే వీటికి అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు. మారుమూల, అటవీ ప్రాంతాల వారు బదిలీ అయ్యేందుకు ఇష్టపడుతున్నారు. 6ఏ, 6బి, 6సి (పెద్దవి) దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు అదే స్థాయి దేవాలయాలకు వెళ్లనున్నారు. మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మంది బదిలీ అయ్యే అవకాశముంది. మన జిల్లాలో ఈవోలు నలుగురు, మిగతా క్లారికల్ క్యాడర్‌లో దాదాపు 60 మందిలో 25 మందికి స్థానచలనం జరిగే అవకాశముంది.

**పదోన్నతులకు ఎదురుచూపులు..**

జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న సిబ్బంది పదోన్నతులపై ఆశలు పెట్టుకున్నారు. వారు కొన్నేళ్లుగా అదే క్యాడర్‌లో పని చేయాల్సి వస్తోంది. కొంతమందికి పదవీ విరమణ వయసు దగ్గర పడటంతో ఈసారైనా పదోన్నతులు వచ్చేనా? అని ఎదురుచూస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే 5 నుంచి 10 దేవాలయాలకు ఇన్‌ఛార్జులుగా పని చేస్తున్న వారికి పనిభారమూ తగ్గుతుంది. పదోన్నతులు ఇస్తే గ్రేడ్–3 స్థాయి ఈవోలుగా నియామకం కానున్నారు.

**ఉద్యోగుల సమాచారం పంపాం**

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొత్తం రాష్ట్ర దేవాదాయ కమిషనర్ పరిధిలో ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్త ఉద్యోగుల సమాచారం పైకి పంపాం. అక్కడ ఉద్యోగుల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. మంగళవారం ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది.
– ఆకునూరి చంద్రశేఖర్, సహాయ కమిషనర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా

**దశాబ్ద కాలంగా నిరీక్షణ**కొందరు ఉద్యోగులు దశాబ్ద కాలంగా బదిలీ కోసం ఎదురుచూ స్తున్నారు. ఏళ్ల తరబడి ఒకే ఆలయాల్లో ఉండటంతో కొందరికి మేలు జరిగింది. మరికొందరు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దేవాలయాల్లో కొంత మార్పు తీసుకురావాలని ప్రభుత్వం బదిలీలకు శ్రీకారం చుట్టింది.– ఎ.ప్రభాకర్, అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా అర్చక, ఉద్యోగ సంఘం

# మైనర్ల వేగం.. తల్లిదండ్రులకు శోకం



కరీంనగర్ : ఒడిశాకు చెందిన ఓ కార్మికుడు జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో సహా అయిదేళ్ల కిందట కరీంనగర్‌కు వచ్చారు. ఉపాధి పొందుతూ ఇక్కడే స్థిరపడ్డారు. నెల రోజుల కిందట ఆయన కుమారుడు (పదహారు ఏళ్లు) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ద్విచక్రవాహనం తీసుకొని స్నేహితులతో రాత్రివేళ నగర శివారుకు వెళ్లాడు. ఇంటికి వచ్చే క్రమంలో ఉజ్వలపార్క్ వద్దనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని ఓ విద్యార్థి ఇంట్లో ఎవరికీ తెలియకుండా కారు బయటకు తీసుకెళ్లాడు. వాహన వేగాన్ని అదుపు చేయకపోవడంతో రోడ్డు పక్కన పని చేసుకుంటున్న వారిపై కారు దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన అప్పట్లో కలకలం రేపింది. విద్యార్థి తండ్రితోపాటు కారులో ప్రయాణించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.పద్దెనిమిదేళ్లలోపే చాలామంది విద్యార్థులు ద్విచక్రవాహనాలు, కార్లు నడపాలని ఉత్సాహపడుతుంటారు. అది కాస్త ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. 8వ తరగతి చదువుతున్న చాలామంది విద్యార్థులు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఈ ఏడాది కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఇప్పటివరకు 70కి పైగా మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.


పర్యవేక్షణ లోపం..

వాహనం నడపాలంటే 18 ఏళ్లు నిండటమే కాకుండా రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఇవేమి పట్టకుండా కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛతో ఇష్టానుసారంగా నడుపుతూ.. ప్రమాదం జరిగితే వాహనాన్ని అక్కడే వదిలేసి జారుకుంటున్నారు. వాహన వినియోగంపై సరైన అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇవీ నిబంధనలు..రవాణా శాఖ నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు మాత్రమే వాహనం నడిపేందుకు అర్హులు.మైనర్లు వాహనం నడిపినా, ఏదైనా ప్రమాదం జరిగినా అందుకు కుటుంబ పెద్దలను బాధ్యులుగా చేస్తూ వారిపై కేసు నమోదు చేస్తారు. రూ.1500 జరిమానా విధిస్తారు.

కేసును బట్టి తల్లిదండ్రులు, వాహన యజమానులకు 21 రోజుల జైలు శిక్ష.. రూ.5 నుంచి రూ.25 వేల జరిమానా వేస్తారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త రవాణా చట్టం ప్రకారం.. మైనర్లు జువైనల్ హోంకు వెళ్లే అవకాశముంది. మైనర్లు వాహనం పడిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే.. అతని వయసు, ప్రవర్తన బట్టి కేసును క్రిమినల్ కోర్టుకు బదిలీ చేస్తారు.కేసులు మరింత కఠినం..మైనర్ డ్రైవింగ్‌పై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. మొదటిసారి పట్టుబడితే వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. రెండోసారి మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. ఏదైనా ప్రమాదం జరిగితే మైనర్‌తోపాటు అతని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.– జి.నరేందర్, ఏసీపీ కరీంనగర్ టౌన్

# చెరువెంత..? చెరలో ఉన్నదెంత..?



రాజధానిలో చెరువుల వారీగా ఆక్రమణల చిట్టాను వెలికి తీసే పనిలో హైడ్రా నిమగ్నమైంది. హైడ్రా పూర్తిస్థాయిలో ఏర్పాటవడానికి మరో నెల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ లోపు మహానగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లోని చెరువుల పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో ఆరాతీస్తున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి రికార్డులు సేకరించి ఒక్కో చెరువు వారీగా ఎంత భూమి ఆక్రమణకు గురైందన్న దానిపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. అనంతరం ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ రూపొందించనున్నారు. **కేవలం 212 చెరువులకు మాత్రమే..**

బల్దియా, హెచ్‌ఎండీఏ పరిధిలోని 3,689 చెరువులన్నింటికి ఎఫ్‌టీఎల్ గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వమని రెండేళ్ల కిందట గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ఇప్పటివరకు 2,375 చెరువులకు మాత్రమే డ్రాప్టు నోటిఫికేషన్‌ను ఇచ్చారు. పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ ఇచ్చింది కేవలం 212 చెరువులకు మాత్రమే. నగరపరిధిలో 185 ప్రధాన చెరువులుంటే వాటిలో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది కేవలం 27 చెరువులకు మాత్రమే. ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో వెయ్యి ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని, వేల సంఖ్యలో నిర్మాణాలు న్నాయని అధికారులు చెబుతున్నారు. **పూర్తిస్థాయి సిబ్బంది నియామకం తర్వాత..**ఓఆర్ఆర్ పరిధి వరకు చెరువుల పరిరక్షణ బాధ్యతను కొత్తగా ఏర్పడిన హైడ్రాకు అప్పగించారు. తొలుత చెరువుల ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. ఆక్రమణల గురించి ప్రజలు సమాచారం ఇచ్చేలా ప్రత్యేకంగా ట్రోల్ ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు చేశారు. వచ్చే నెలాఖరు నాటికి హైడ్రాలో పూర్తిస్థాయి సిబ్బంది నియామకం జరగనుంది.

# సరిహద్దులోనే పట్టేస్తే సరి..!

భువనగిరి : నల్గొండ జిల్లాలో గంజాయి పట్టుబడిన ఘటనలు నిత్యం ఏదో ఒక చోట వెలుగుచూస్తూనే ఉన్నాయి. నిఘా వర్గాల కళ్లు కప్పి ఏదో విధంగా సరిహద్దులు దాటిస్తున్నారు. ఎంతో మంది జీవితాలకు ప్రతిబంధకంగా మారుతున్న మహమ్మారి అడ్డుకట్ట ఇప్పట్లో సాధ్యమయ్యే పనేనా అన్న నిరాసక్తత వ్యక్తమవుతోంది. ఈ మత్తులో చేస్తున్న నేరాల సంఖ్య పెరగడంతోపాటు దీనికి బానిసలుగా మారుతున్న యువత జీవితాలు మసకబారి పోతున్నాయి. వారి తల్లిదండ్రుల ఆవేదనకు అంతే లేకుండా పోతోంది.

**రాష్ట్రంలోకి వస్తోందిలా...**

విశాఖ ఏజెన్సీ ప్రాంతంలోని అరకు, పాడేరు, లంబసింగి తదితర ప్రాంతాలతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమంగా జిల్లా మీదుగా హైదరాబాద్‌కు తరలివెళ్తోంది. ఏపీ నుంచి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రోడ్డు, రైలు, నదీ మార్గాల మీదుగా మన రాష్ట్రంలోకి వస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోనూ అక్కడి పోలీసులు గంజాయిపై నిఘా పెంచడంతో కొంత తగ్గుముఖం పట్టింది. వీటి మూలాలను పూర్తిగా చెరిపివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలోని పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించారు.గేట్‌వేగా సూర్యాపేట! దేశంలోనే గంజాయి ఎక్కడ పట్టుబడినా విశాఖ ఏజెన్సీ పేరు వినిపిస్తోంది. అక్కడ పండించిన గంజాయిని గేట్‌వే ఆఫ్ తెలంగాణగా పేరొందిన సూర్యాపేట జిల్లా మీదుగానే ఎక్కువ మొత్తంలో తరలిస్తున్నారనే ఆరోపణ ఉంది. జిల్లా సరిహద్దు ప్రాంతంలో వాహనాల తనిఖీలను క్షుణ్ణంగా చేపడితే కొంత మేర అడ్డుకట్ట పడే అవకాశాలు ఉన్నాయి. తనిఖీలు సరిగా లేకనే ఖరీదైన కార్లు, ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, రైళ్లలో అక్రమార్కులు రవాణా చేస్తున్నారని తెలుస్తోంది.



చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలు:

నల్గొండ జిల్లాలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిలోని దామరచర్ల

కృష్ణా పరివాహక ప్రాంతం నుంచి వచ్చే అవకాశం ఉన్న వాడపల్లి

హైదరాబాద్– నాగార్జునసాగర్ రహదారిలోని చింతపల్లి

రైల్వే మార్గం ద్వారా వచ్చే మిర్యాలగూడ నల్గొండ, బీబీనగర్ రైల్వే స్టేషన్లు

వరంగల్– హైదరాబాద్ రహదారిలో ఆలేరు

హైదరాబాద్– విజయవాడ రహదారిలోని రామాపురం క్రాస్‌రోడ్డు, కొర్లపహాడ్, పంతంగి టోల్ గేట్లు

మహబూబాబాద్ జిల్లా నుంచి మామిళ్లగూడెం సమీపంలోని సింగరేణిపల్లి, మద్దిరాల సమీపంలోని కుంటపల్లి

కోదాడ సమీపంలోని నేలకొండపల్లి, మఠంపల్లి, జగ్గయ్యపేట మీదుగా రాకపోకలకు అవకాశం ఉన్న పులిచింతల

తిరుమలగిరి–జనగామ రహదారిలోని మొండ్రాయి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలి.

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

శరత్‌చంద్ర పవార్, ఎస్పీ, నల్గొండ

నల్గొండను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టులతోపాటు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే గంజాయి వినియోగం, విక్రయాలు చేస్తున్న 60 మందిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇస్తున్నాం. జిల్లాలో నార్కొటిక్ పరీక్షల కోసం యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. మాదకద్రవ్యాల వాసనను పసిగట్టే పోలీసు శునకాన్ని అందుబాటులో ఉంచాం. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలి.

# స్థలమున్నా.. నిధులు లేవు!

మల్లాపూర్ : మల్లాపూర్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. గతంలో రెవెన్యూ అధికారులు అనువైన స్థలం కేటాయించకపోవడంతో శాప్ అధికారులు తిరస్కరించారు. రెవెన్యూ అధికారులు మల్లాపూర్ శివారులోని దుబ్బగట్టు ప్రాంతంలో సర్వే నంబర్ 568లో 5 ఎకరాల స్థలంను శాప్ అధికారులకు అప్పగించారు. స్థలం ఎంపిక చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేయకపోవడంతో నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

మల్లాపూర్ మండలంలో మినీ స్టేడియం నిర్మాణం కోసం సాధన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పలుమార్లు ధర్నాలు చేపట్టి నిరసనలు తెలపడంతో స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మల్లాపూర్ శివారులోని సర్వే నంబర్



858లో అయిదు ఎకరాల స్థలం కేటాయించారు. రెవెన్యూ అధికారుల నివేదికను శాప్ అధికారులకు పంపారు. దీంతో స్టేడియం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. స్టేడియం నిర్మాణం కోసం కేటాయించిన స్థలం ఏమాత్రం అనువుగా లేదని శాప్ అధికారులు తిరస్కరించారు. రెండు సంవత్సరాల కిందట దుబ్బగట్టు ప్రాంతంలోని సర్వే నంబర్ 568లో 5 ఎకరాల స్థలం కేటాయించారు. స్థలం కేటాయించి మూడు ఏళ్లు గడుస్తున్నా స్టేడియం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ నిధులు రూ.10 లక్షలతో తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతు ఇటీవల పూర్తయినా పూర్తిస్థాయిలో ఆటలు ఆడుకోలేని పరిస్థితి ఉంది. స్టేడియం నిర్మాణం పూర్తికి రూ.2 నుంచి రూ.3 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు

# రెవెన్యూ సేవలకు.. నగదు రహిత చెల్లింపు

సూర్యాపేట : ప్రభుత్వానికి సంబంధించి ఏ ధ్రువపత్రం కావాలన్నా, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలను తప్పనిసరిగా ఆశ్రయించాల్సిందే. దీన్ని అదనుగా చేసుకొని కొందరు మీసేవ నిర్వాహకులు సర్వర్ సమస్య, ఇతర కారణాలు చూపుతూ పనులు ఆలస్యం చేస్తున్నారు. త్వరగా ధ్రువపత్రం రావాలంటే ప్రభుత్వ ధరల కంటే అధికంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు అధికారులకు వస్తుండటంతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పారదర్శక చెల్లింపులకు కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా తొలుత రెవెన్యూ సేవలకు క్యూఆర్ కోడ్ ద్వారా నగదు రహిత లావాదేవీలను అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ విధానాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మీ సేవల్లోనూ అమలు జరిగేలా సంబంధిత నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది.

**కొత్త విధానంలో చెల్లింపులు ఇలా..**

ఉమ్మడి జిల్లాలో 320 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ధరల పట్టిక ప్రదర్శించకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ విధానం ద్వారా వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుంది. ధ్రువీకరణ పత్రానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక పేమెంట్ ఆప్షన్ వస్తుంది. సంబంధిత ధ్రువీకరణ పత్రానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎంత అనేది చరవాణికి సంక్షిప్త సమాచారంతోపాటు లింక్ వస్తుంది. అప్పుడు దరఖాస్తుదారులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. నగదు బదలాయింపులు జరగగానే రసీదు ప్రింట్ వస్తుంది. ఈ విధానం ద్వారా అదనపు వసూళ్లకు తావుండదని, నిర్ణీత రుసుం మాత్రమే చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మీసేవ కేంద్రాల వివరాలు
నల్గొండ: 154
సూర్యాపేట: 91
యాదాద్రి: 75

త్వరలో అన్ని సేవలకు..
గఫార్, ఈడీఎం, సూర్యాపేట

మీసేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ దిశగా క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించి ఈ విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందించాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. త్వరలో మిగతా సేవలకూ ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నూతన విధానంతో అదనపు వసూళ్లకు అవకాశం ఉండదు.

# వరదొస్తోంది మామో..!

నల్గొండ : నాగార్జునసాగర్‌కు రెండేళ్ల అనంతరం వరద వస్తోంది. జులై నెలలో సాగర్‌కు ప్రవాహాలు మొదలుకావడం గత ఐదేళ్లలో ఇది నాలుగోసారి. శ్రీశైలం జలాశయంలోని మూడు గేట్లను ఎత్తడం, విద్యుదుత్పత్తి ద్వారా సుమారు 1.60 లక్షల క్యూసెక్కుల నీటిని సోమవారం సాయంత్రం దిగువకు వదులుతుండటంతో సాగర్ జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు వద్ద 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా.. ఉదయం నాటికి ఇది లక్షన్నర క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. రానున్న రెండు మూడు రోజుల్లో శ్రీశైలం నుంచి మరిన్ని గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగే నేపథ్యంలో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో మరింత పెరగనుంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని కృష్ణా పరివాహక ప్రాంతాల్లో మరో నాలుగైదు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఇప్పటికే కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించింది. దీంతో వరద ప్రవాహం ప్రాజెక్టులోకి స్థిరంగా వారం రోజుల పాటూ కొనసాగే అవకాశం ఉందనే అంచనాల మధ్య.. ఆగస్టు 10లోపు సాగర్ జలాశయం నిండుకుండ కానుంది. కృష్ణ బేసిన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో గతేడాదే సాగర్‌కు ఆశించినంత ప్రవాహాలు రాలేదు. అంతకుముందు ఐదేళ్లు భారీ వర్షాలు పడి ఆగస్టు నెలలోనే రెండు కాల్వలకు అధికారులు నీటిని విడుదల చేశారు. ఐదారు రోజుల్లో కాల్వలకు నీళు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగితే సాగర్ కుడి, ఎడమకాల్వలకు ఐదారు రోజుల్లో నీటిని విడుదల చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కృష్ణా నది యాజమాన్య బోర్డు



(కేఆర్ఎంబీ) ఆధీనంలో ఉండటంతో కేంద్ర జలవనరుల శాఖ ఆదేశం మేరకు నీటి విడుదల ఉండనుందని ఎన్నెస్పీ అధికారులు వెల్లడిస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వ కింద నల్గొండ, సూర్యాపేట జిల్లాలో 3.3 లక్షల ఎకరాలు ఉండగా..ఎత్తిపోతల పథకాల కింద మరో 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏఎమ్మార్ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కింద మరో 2.5 లక్షల ఎకరాలు సాగవుతుంది. తాజా పరిస్థితులతో ఉమ్మడి జిల్లాలో గత యాసంగి సీజన్ కంటే సుమారు ఆరు లక్షల ఎకరాల్లో వరి సాగు పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఐదేళ్లలో సాగర్‌కు ఆగస్టులో నీటిని విడుదల చేయడం మూడోసారి. మరోవైపు ఎగువ నుంచి భారీ వరద వస్తున్నందున కృష్ణా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపలుపట్టడానికి వెళ్లవద్దని.. ఈత, పశువులను నదిలోకి తీసుకెళ్లడం లాంటివి పరిసర ప్రాంతాల ప్రజలు చేయవద్దని నల్గొండ కలెక్టరు నారాయణరెడ్డి హెచ్చరించారు.

# దిగువన గోదారి.. ఎగువకు చేరేనా?



సిరిసిల్ల: జలాశయాలు.. చెరువులు నీటి ప్రవాహం లేక కళ తప్పాయి. దిగువన గోదావరి జలాలు ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా మధ్యమానేరుకు వచ్చి చేరుతున్నాయి. కాళేశ్వరం లింక్-3లో మధ్యమానేరు నుంచి ఎగువమానేరుకు నీటి తరలింపులో అసంపూర్తి పనులతో సింగసముద్రం వరకు తరలించే వీలుంది. వర్షపాతంలోనూ జిల్లాలో నేటికి 430.7 మి.మీ.లు కురవాల్సి ఉండగా 345.7 మి.మీ. మాత్రమే కురిసింది. మెట్ట ప్రాంతంలో వర్షాధారంగా ఎక్కడా చెరువులు నిండలేదు. ఈ నేపథ్యంలో జిల్లా సాగునీటి వనరుల్లో నెలకొన్న భిన్న పరిస్థితులపై కథనం.

**దిగువన జలకళ**

గోదావరిలోకి వరదనీరు వచ్చిచేరుతుండటంతో ఎత్తిపోతల ద్వారా నంది పంపుహౌస్ నుంచి మధ్యమానేరుకు నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం మధ్యమానేరులో 7.66 టీఎంసీల నీరుంది. ఇది 15 టీఎంసీలు చేరిన తర్వాతే దిగువ మానేరు, అన్నపూర్ణ జలాశయాలకు తరలించే వీలుంది. ఎగువమానేరు జలాశయం సామర్థ్యం రెండు టీఎంసీలు. ప్రస్తుతం దీనిలో నీటి నిల్వ 0.42 టీఎంసీలు మాత్రమే ఉంది. దీనిలోకి వరదనీరు అంతంత మాత్రమే. గతేడాది ఈ సమయానికి జలాశయంలో ఒక టీఎంసీపైన నీరుంది. ఈ ఏడాది చెప్పుకోదగ్గ నీటిధారలే లేవు. ఈ జలాశయం కింద గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలల్లో 40వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం ఆధారపడి ఉంది. మల్లన్నసాగర్ ప్రధాన కాల్వకు యూటీ నుంచి కూడెల్లివాగులోకి నీటిని విడుదల చేయడం ద్వారా ఎగువమానేరుకు నీరు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మల్లన్నసాగర్‌కు నీటి తరలింపే సందిగ్ధంలో ఉంది. జిల్లా మొత్తం 666 చెరువులున్నాయి. వేములవాడ, వేములవాడ గ్రామీణ, కోనరావుపేట మండలాల్లోని 27 చెరువుల్లో మాత్రమే 75శాతం నీరుంది. మిగతా వాటిలో 25శాతం కూడా నీరు చేరలేని పరిస్థితి ఉంది. చందుర్తి మండలంలో అత్యధికం, బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో మాత్రమే సగటుకు మించి వర్షపాతం. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**9వ ప్యాకేజీపైనే ఆశలు**

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-3లో ప్రధానమైన తొమ్మిదో ప్యాకేజీలోని మల్కపేట పంపుహౌస్‌లో గతేడాదే మే, జూన్ నెలలో రెండు మోటార్ల ట్రయల్ రన్ ప్రారంభానికి సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో దీని ఊసేలేకుండా పోయింది. మధ్యమానేరులో 15 టీఎంసీల పైన నీరు చేరితే.. వెనక జలాల నుంచి మల్కపేట పంపుహౌస్‌కు నీటిని తరలిండం సులభం అవుతుంది. అక్కడి నుంచి కాల్వ ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని మైసమ్మ చెరువు, అక్కడి నుంచి గంభీరావుపేటలో సింగసముద్రం చెరువుకు కాల్వ ద్వారా నిటిని తరలించవచ్చు. ఇక్కడి వరకు కాల్వ పనులు పూర్తయ్యాయి. ఫేజ్-2లో సింగసముద్రం నుంచి ముస్తాఫా నగర్‌లో 2 టీఎంసీల సామర్థ్యం ఉన్న బట్టల చెరువులోకి తరలించే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మెట్టప్రాంతం కావడంతో జిల్లాలో జలాశయాలు, చెరువులకు నీరుచేరితే భూగర్భజలాలు నిలకడగా ఉంటాయి. వాటిపైనే పంటల సాగు ఆధారపడుతుంది.

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు షురూ




పెద్దపలి : పంచాయతీ ఎన్నికలపై ఆరు నెలల తర్వాత కదలిక వచ్చింది. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ఇందుకోసం వార్డుల మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణివ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది. దీంతో ప్రతి జిల్లా నుంచి అయిదురు ఆపరేటర్ల వివరాలు పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాలకు వచ్చే నెల 2న శిక్షణ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు పల్లె పోరుపై కసరత్తు ప్రారంభం కావడంతో రాజకీయ నాయకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

**అభివృద్ధిపై ప్రభావం**

పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన జరుగుతోంది. ప్రత్యేక అధికారులు తమ మాతృశాఖ పనులకే పరిమితమవుతూ.. సభలు, సమావేశాలకు వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఏ చిన్న సమస్య వచ్చినా వార్డు సభ్యులు, సర్పంచులను ఆశ్రయించే ప్రజలు ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. నిర్ణీత వ్యవధిలో ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోగా పల్లె అభివృద్ధిపై ప్రభావం పడుతోంది.

**రిజర్వేషన్లపై చర్చ**

ఉమ్మడి జిల్లాలో 1,213 గ్రామ పంచాయతీలున్నాయి. జగిత్యాలలో 380, పెద్దపల్లి 265, కరీంనగర్ 313, రాజన్న సిరిసిల్ల 255 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆగస్టు మొదటి వారంలోపు ఓటరు జాబితా సిద్ధం చేయాలనే సీఎం ప్రకటించిన నేపథ్యంలో పల్లెల్లో ఎన్నికల చర్చ జోరుగా సాగుతోంది. ఆశావాహులు రిజర్వేషన్ల ఖరారుపై తమ అనుచరగణాలతో చర్చిస్తున్నారు.

ప్రతి జిల్లా నుంచి అయిదుగురు ఆపరేటర్లు శిక్షణలో పాల్గొనున్నారు. వార్డుల మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటరు జాబితా రూపొందించే ప్రక్రియపై వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఓటరు జాబితా అందింది. దాని ఆధారంగా పంచాయతీ అధికారులు తుది జాబితా సిద్ధం చేస్తారు.

ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీలకు జనాభా, బీసీలకు ఓటర్ల ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తారు. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్‌లను అయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ మేరకే నిర్వహిస్తుందా.. రిజర్వేషన్లు మారుస్తుందా అన్న సందిగ్ధం నెలకొంది.

# పర్యవేక్షణ లోపం.. స్వచ్ఛతకు విఘాతం

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నానికి పట్టణ శివారు రోడ్ల వెంబడి కొందరు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పారబోస్తూ విఘాతం కలిగిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ నామమాత్రం కావడం ఇందుకు దోహదపడుతోంది. పట్టణంలోని రెండు బైపాస్ రహదారుల వెంబడి, మూలవాగు, పట్టణ శివారు కాలువలు, మూలవాగు, పట్టణంలోని ఖాళీ స్థలాలు వ్యర్థాలకు నిలయంగా మారాయి. వర్షాకాలం కావడంతో వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది.

**రూ.20 లక్షలు కేటాయించినా..**

వేములవాడ పట్టణంతో పాటు మరో అయిదు విలీన గ్రామాలను కలుపుకొని 28 వార్డులున్నాయి. ఇందులో పారిశుద్ధ్యం పనులు చేసేందుకు 93 మంది రెగ్యులర్ కార్మికులు ఉన్నారు. వీరితో పాటు తాత్కాలిక సిబ్బంది పని చేస్తున్నారు. అయినా వార్డుల్లో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్యం పనులు జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వానాకాలంలో ప్రతి వార్డులో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు దాదాపు రూ.20 లక్షలు కేటాయించి మున్సిపల్ కార్మికులతోపాటు అదనంగా రోజు పది నుంచి పదిహేను మంది కార్మికులను టెండర్ ద్వారా ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. మురుగు కాలువల వెంబడి గడ్డి తొలగించడం, కాలువల్లో మురుగు తొలగించడం వంటి పనులు చేపట్టారు. ఈ పనులు కొన్ని కాలనీలకే పరిమితమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి రోజు చెత్త వాహనాల ద్వారా 20 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపు యార్డుకు తరలిస్తున్నారు. అయినా కొన్ని వార్డుల్లో చెత్త ఆటోలు రావడం లేదనే ఆరోపణలున్నాయి.

**యథేచ్ఛగా వ్యర్థాల పారబోత**

వేములవాడ పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని రోడ్ల వెంబడి చెత్తా చెదారంతోపాటు కోళ్ల వ్యర్థాలు, ఇతరత్రా వ్యర్థాలను యథేచ్ఛగా



పారేయడం పరిపాటిగా మారింది. నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇది నిరాటంకంగా సాగుతోంది. రహదారులపై వ్యర్థాలను పారబోసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో పట్టణ శివారు రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయని, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో రూ.20 లక్షలు వెచ్చించి ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. ఇప్పటికే ఎనిమిది వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు పూర్తయ్యాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్త పారబోసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.- అన్వేశ్, కమిషనర్ మున్సిపల్ వేములవాడ

# దర్జాగా కబ్జా..!

ఆత్మకూర్ : భూగర్భ జలాలను పెంపొందించే ప్రధాన జలవనరులైన చెరువులు, కుంటలు ఏటేటా కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం వేసవి సీజన్‌లో అక్రమార్కులు శిఖం భూములపై కన్నేసి యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ముఖ్యంగా శిఖంలో యంత్రాల సహాయంతో కట్టలు పోసి మడులు తయారు చేస్తున్నారు. దీంతో విశాలంగా ఉండాల్సిన చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నాయి. జిల్లాలో శిఖం ఆక్రమణలకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకుంటే రాబోయే రోజుల్లో పెద్ద చెరువులూ.. చిన్న, చిన్న కుంటలుగా మారిపోయే ప్రమాదం ఉంది. ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారనుంది. బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటి సాగు విస్తీర్ణం తగ్గనుంది.

**ఆక్రమణలు ఇలా..**

మండల కేంద్రంలోని పెద్ద చెరువు శిఖంభూమిలో పొక్లెయిన్‌తో కట్టలు పోసి మడులుగా చేస్తున్నారు. వేసవిలో చెరువులోని తుమ్మచెట్లను కొట్టివేయడమే కాకుండా చుట్టూ శిఖం భూమిని కబ్జా చేశారు. 802 సర్వేనంబరులో గల పెద్ద చెరువు విస్తీర్ణం 256 ఎకరాలు. ఇందులో సుమారు నలభై ఎకరాల వరకు ఆక్రమించి పొలాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదే మండలంలోని గట్టికల్‌లో 143 సర్వే నంబరులో 29.04 ఎకరాల్లో ఊర చెరువు విస్తరించి ఉంది. మట్టితో శిఖం భూములు పూడ్చివేసి ఎకరాలకొద్ది కబ్జా చేశారు. శిఖంలో కట్ట నిర్మించి సిమెంట్ గూనలు వేశారని అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లలోనే 12 ఎకరాలకు పైగా ఆక్రమించినట్లు చెబుతున్నారు.

నెమ్మికల్‌లోని 484 సర్వే నంబరులో చౌటచెరువు 84 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. మూడేళ్ల క్రితమే శిఖం భూముల ఆక్రమణపై స్థానిక మత్స్యకారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు చౌటచెరువును సర్వే చేసి 25 ఎకరాలు ఆక్రమణకు గురయినట్లు తేల్చారు. బాధ్యులపై తీసుకున్న చర్యలు శూన్యం. ఆక్రమణదారుల్లో ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నట్లు గుర్తించారు. మళ్లీ ఈ వేసవిలోనూ తుమ్మచెట్లను కొట్టేసి యంత్రాల సహాయంతో పొలం మడులు తయారు చేశారు.

సూర్యాపేట మున్సిపాలిటీ కుడకుడ కర్నాలకుంట యథేచ్ఛగా కబ్జాకు గురవుతోంది. శిఖం భూముల్లో ప్లాట్లను తయారు చేశారు. దీనిపై పలుమార్లు ఆందోళన నిర్వహించారు. అధికారులు విచారణ చేసినా చర్యలు చేపట్టలేదు.



చివ్వెంల మండలం వల్లభాపురం,అక్కలదేవిగూడెం చెరువు శిఖాలను రైతులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు.

పెన్‌పహాడ్ మండలంలోని రంగయ్యగూడెం చెరువు, యల్లప్పకుంట చెరువు శిఖాలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువు లోపలికి చొచ్చుకొచ్చి పొలాలు సేద్యం చేస్తున్నారు.

జిల్లాలో ఐబీ లెక్కల ప్రకారం చెరువులు, కుంటల వివరాలు..
వంద ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగినవి: 166 ఆయకట్టు: 36,776 ఎకరాలువంద ఎకరాల లోపు ఉన్న కుంటలు: 870 ఆయకట్టు: 32,609 ఎకరాలుఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నాం
శివధర్మతేజ, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, సూర్యాపేట

చెరువుల ఆక్రమణపై ఇటీవల కలెక్టర్‌తో నిర్వహించిన సమావేశంలో చర్చించాం. సూర్యాపేట పట్టణం వరకు ఒక కమిటీ వేశాం. చెరువులు, కుంటల్లో పాత ఎఫ్‌టీఎల్ ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. శిఖం భూములను ఆక్రమించే రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాం. కబ్జాపై ఫిర్యాదు అందిన సత్వరమే చర్యలు తీసుకుంటాం.

# గ్రామానికో పోలీస్..!

నల్గొండ : పల్లె నుంచి పట్టణం వరకు ఎక్కడ అవినీతి, అక్రమాలు జరిగినా.. పూర్తి స్థాయి సమాచారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి చేరేలా పోలీస్ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. గ్రామీణ పోలీస్ వ్యవస్థను (వీపీవో) మరింత పటిష్ఠం చేయడంతో పాటు నేర రహిత జిల్లాగా మార్చేందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రణాళికలు సిద్ధం చేశారు. పదేళ్ల క్రితం ఉన్న విలేజ్ పోలీస్ వ్యవస్థను తిరిగి జిల్లాలో నేటి నుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటికే మూడు డివిజన్‌లలో ఏడు గ్రామాలకు పోలీస్ అధికారులను ఎంపిక చేశారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు జరగనున్నాయి. గ్రామానికి ఒకరు, పట్టణాల్లో వార్డుకు ఒక పోలీస్ అధికారిని ఎంపిక చేసి ప్రధాన కూడళ్లలో వారి చరవాణి నంబర్లు ప్రదర్శిస్తారు. వీరు ఆయా ప్రాంతాల్లో పాత నేరస్థుల కదలికలతో పాటు సంఘవిద్రోహ శక్తుల వివరాలు సేకరిస్తారు. స్థానికంగా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చూపడంతో పాటు పైస్థాయి అధికారులకు నివేదిస్తారు. గంజాయి, నిషేధిత గుట్కా, బెల్టుషాపులు, రోడ్డు ప్రమాద నివారణ మార్గాలు, దొంగతనాలు, పేకాట స్థావరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గుడుంబా తయారీపై నిఘా పెట్టడంతో పాటు పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించనున్నారు.

జిల్లాకు చేరిన నార్కోటిక్ కిట్లు..

గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి నేటి నుంచి ప్రత్యేక ఏర్పాట్లను ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు గంజాయి తాగితే నిర్ధారించే నార్కోటిక్ యంత్రాలు (ఒక్కోటి రూ.600 ఖర్చుతో) పది చొప్పున అందజేశారు. వీటితో పాటు ఒక నార్కోటిక్ డాగ్ (మత్తుపదార్థాలను గుర్తించే శునకం)కు శిక్షణ ఇచ్చి పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక గదిలో అందుబాటులో ఉంచారు. ఏవోబీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలతో పాటు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో నిఘా పెంచనున్నారు.

నేటి నుంచి అవగాహన సదస్సులు..

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన 60 మందిని గుర్తించారు. వారితో పాటు వారి తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించనున్నారు. స్టేషన్ల వారీగా పాత నేరస్థుల కదలికలపై అప్రమత్తత పెంచనున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు తెలిపారు. సమాచారం ఇచ్చే వారు వాట్సప్ చరవాణి నెంబర్ 87126 70426ను సంప్రదించాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# సమీపించిన గడువు

భువనగిరి : సర్కారు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న పలు నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నెల 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. పాఠశాలల ప్రారంభానికి ఇంకా రెండు రోజులే గడువు ఉండటంతో పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ కూలీల కొరత, నిర్మాణాలకు నీటి క్యూరింగ్ చేయాల్సి ఉండటంతో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్మాణ సామగ్రి, భవన నిర్మాణాల వ్యర్థాలు ఎక్కడికక్కడ పడి ఉండటంతో పాఠశాల ప్రారంభానికి తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారనుంది.

పనులు ఇలా...జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం కింద నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 731 పాఠశాలలు ఉండగా ఈ పథకం కింద 532 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రతిపాదించారు. పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ, ఉపాధి హామీ నిధులు రూ.18.50 మంజూరు చేసి ఇప్పటికే 20 శాతం నిధులు విడుదల



చేసింది. ఆ నిధులతో 1783 నిర్మాణాలను ప్రతిపాదించారు. ఇప్పటి వరకు 215 పాఠశాలల్లో 1330 పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఐదు రకాల పనులను అధికారులు ప్రతిపాదించారు. ఆయా పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. చిన్న చిన్నపనులు గడువులోపు పూర్తి చేసేందుకు అధికారులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. పూర్తయిన పాఠశాలలకు పేయింటింగ్ వేసి తరగతులు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

గడువు లోపు పూర్తి చేస్తాం

– నారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

పాఠశాలల ప్రారంభం నాటికి పనులు అన్ని పూర్తి చేస్తాం. నీటి సదుపాయం, మరమ్మతులు, మరుగుదొడ్ల మరమ్మతులకు తొలి ప్రాధాన్యంగా పూర్తి చేశాం. ఉపాధిహామీ నిధులు మంజూరయిన వెంటనే బాలికల మరుగుదొడ్లు నిర్మిస్తాం. గతంలో ప్రతిపాదించిన పనులకు అదనంగా కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనులు ప్రతిపాదించ్చా. అన్నింటినీ గడువులోపు పూర్తి చేస్తాం.

# అధ్వాన రహదారులు బాగయ్యేనా..!



కరీంనగర్ :పూర్తిగా తారు తేలిపోయి కనిపిస్తున్న రహదారి మానకొండూరు నుంచి వెల్ది వెళ్లే మార్గం. ఏడాదిన్నర కాలంగా ఇక్కడ ఇదే దుస్థితి నెలకొంది. వాహనదారులు ఈ రహదారిపై వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకుంటున్నారు. వెల్ది నుంచి రంగపేట మీదుగా మార్గాన్ని ఎంచుకుని అటు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు దీనికి మరమ్మతులు చేపట్టలేదు. ఈ చిత్రంలో కనిపిస్తున్నది పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ – పొత్కపల్లి మార్గంలోని రహదారి. చాలా కాలంగా రోడ్డుపై ఉన్న తారు తేలిపోయి గుంతలమయంగా మారింది. నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలతో నిండి ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం నరకమే. గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారి ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోలేదు. నిధులు లేవనే కారణంతో మూడేళ్లుగా ఎలాంటి పనులు చేపట్టలేదు. మూడేళ్లుగా ఇదే స్థితిలో ఉంది. కొత్తగా మంజూరైన నిధులతో దీనికి మోక్షం లభిస్తుందని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా ఉన్న ఇలాంటి రహదారులు ఎన్నో ఉన్నాయి. ప్రయాణానికి అనుకూలంగా లేనివి, వర్షాలకు దెబ్బతిన్నవి.. మరమ్మతులకు నోచుకోని వాటిపై అనేక సార్లు అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళుతున్నా నిధుల మంజూరు లేక పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. అక్కడక్కడా అరకొర నిధులతో పనులు చేపడుతున్నా అవి సరిపోక మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి. ఉమ్మడి జిల్లా పరిధిలో 942 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమైనట్లు అధికారులు గుర్తించారు. వాటి మరమ్మతులు.. నిర్మాణానికి రూ.324 కోట్లతో అంచనాలు వేశారు. గతంలోనే ఈ ప్రతిపాదనలు చేశారు. వాటిలో కొన్ని పనులు పూర్తి చేసినా ఇంకా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ.850 కోట్లు రహదారుల కోసం రాష్ట్రానికి కేటాయించింది. ఒక్కో జిల్లాకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు కేటాయించి పనులు చేపట్టాలని రహదారులు భవనాల శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో రహదారులు మెరుగుపడే అవకాశం ఉందని వాహనదారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించడంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో కొంత వరకు పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. ఎక్కడ అత్యవసరం.. ఏ మార్గంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్న విషయాలను గుర్తించి తదనుగుణంగా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా ఉన్న మార్గాలు కొన్ని

మంథని మండలంలోని మంథని– ఓడెడు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.20 కోట్లతో రహదారి నిర్మించేందుకు ప్రణాళికలు చేశారు. దీంతో పాటు ఓడెడు వంతెన నిర్మాణానికి నిధుల కోసం అంచనాలు తయారు చేశారు.

కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండలంలో కెల్లెడ – రంగపేట రహదారికి పూర్తి అధ్వానంగా మారింది. రంగపేట ఎక్స్ రోడ్డు నుంచి రంగపేట వరకు వాహనాలు నడిచే పరిస్థితి లేదని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్ల జిల్లా కొదురుపాక నుంచి నందిగామ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. వట్టిమల్ల రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వన్‌పల్లి రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ రహదారి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు.

ప్రతిపాదనలు రూపొందించాం

రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం ఇది వరకే ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం. ఎక్కడెక్కడ రహదారులు దెబ్బతిన్నాయి. వాటిని మరమ్మతులు చేయవచ్చా.. పూర్తిగా కొత్తగా నిర్మించాలా అన్న విషయాలను పరిశీలించాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ చేపడతాం.– ఇమామొద్దీన్, డీఈ,రహదారులు భవనాల శాఖ, పెద్దపల్లి

# విలీన గ్రామాలకు పాత పన్నులే..!


సూర్యాపేట : పురపాలికల్లో విలీనమైన గ్రామాలకు శుభవార్త. జిల్లాలోని పురపాలికలకు నిర్వహణ భారంతో పాటు ఉద్యోగుల వేతనాలు, తదితర వాటి ఖర్చులు ఏటా పెరుగుతున్నా.. విలీన గ్రామాలపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. వారి నుంచి పాత పన్నులే వసూలు చేయనున్నారు. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల పురపాలికల్లో ఏటా రూ.27.65 కోట్ల పన్ను డిమాండ్ ఉంటుంది. వీటిలో రూ.7 కోట్ల వరకు విలీన ప్రాంతాల నుంచి వస్తున్నాయి. 2021లో భువన్ సర్వే చేపట్టి పురపాలికల్లో ఆస్తులకు సంబంధించిన వివరాలు సేకరించింది. విలీన గ్రామాల ప్రజల నుంచి పాత రేటు ప్రకారమే పన్నులు వసూలు చేస్తున్నారు. వీటిని ప్రస్తుత రేట్ ప్రకారం వసూలు చేస్తే వారిపై రెట్టింపు భారం పడుతుంది.



ముగిసిన గడువు

జిల్లాలోని ఐదు పురపాలికలకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను 2018లో అప్పటి ప్రభుత్వం విలీనం చేసింది. సూర్యాపేట పురపాలికలో కుడకుడ, రాయినిగూడెం, పిల్లలమర్రి, కుప్పిరెడ్డిగూడెం, కుసుమవారిగూడెం, దురాజ్‌పల్లి, బీబీగూడెం, బాషానాయక్‌తండా, గాంధీనగర్, కోదాడ పరిధిలో కొమరబండ, తమ్మర, నేరేడుచర్లలో రామాపురం, నర్సయ్యగూడెం, రామగిరి, తిరుమలగిరి పురపాలికలో మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలు విలీనమయ్యాయి. విలీనమైన రోజు నుంచి మూడేళ్ల వరకు పెన్నులు పెంచొద్దని గత ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. 2021తోనే విలీన గ్రామాల గడువు ముగిసింది. కానీ పన్నులు పెంచలేదు. ఈ సంవత్సరం కూడా పెంచడం లేదు. 'విలీన గ్రామాలపై పన్ను పెంపుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానందున పెంచడం లేద'ని సూర్యాపేట పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

# ఓబీ మట్టి కుప్పలపై సామూహిక వనాలు



గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణకు సింగరేణి పాటుపడుతోంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ ఎత్తున మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తోంది. సింగరేణి సంస్థ ప్రతిఏటా జూన్, జులై మాసాల్లో మట్టి కుప్పలతో పాటు పరిసర ప్రాంతాల్లో సామూహిక వనాలను పెంపొందిస్తోంది. ఇప్పటికే కోట్ల మొక్కలు నాటి వనాలుగా తయారు చేసిన సింగరేణి ఈ ఏడాది కూడా రామగుండం ప్రాంతంలో 10.46 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఉపరితల గనుల ద్వారా వెలికి తీసిన మట్టికుప్పలపై 86 హెక్టార్లతో పాటు మరో 220.6 హెక్టార్లలో సామూహిక వనాలను పెంచడంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకోసం గోదావరిఖని, సెంటినరీకాలనీలోని ఆర్జీ–1, 3 ప్రాంతాల్లోని నర్సరీల్లో భారీ ఎత్తున మొక్కలను పెంచుతోంది. రహదారులకు ఇరువైపులా వాటిని నాటేందుకు నిర్ణయించింది. ఇది వరకే రాజీవ్‌రహదారికి ఇరువైపులా పెద్దపల్లి నుంచి కరీంనగర్ వరకు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుండగా ప్రధాన రహదారుల పక్కన కూడా ఈసారి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకుంది.

దుమ్ము ఎగిసిపడకుండా...

రామగుండం ప్రాంతంలో భారీ ఎత్తున ఉన్న మట్టి కుప్పలపై మొక్కలు నాటడం వల్ల వాటిలోంచి దుమ్ము ఎగిసిపడకుండా ఉంటుంది. ఈ ప్రాంతంలో నాలుగు ఉపరితల గనుల ద్వారా సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ఓసీపీ–1, 2, 3, 5 గనుల తవ్వకాల ద్వారా ఏర్పాటు చేసిన మట్టి డంపులపై మొక్కలు నాటడం వల్ల బొగ్గు ధూళి, మట్టి ధూళి పైకి ఎగిసిపడకుండా ఉంటుంది.

పలు రకాలు...

నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల మొక్కలను సింగరేణి సంస్థ నర్సరీల్లో పెంచుతోంది. వీటిని వివిధ ప్రాంతాల్లో నాటేందుకు ఏర్పాట్లు చేసుకుంది. వనాల మాదిరిగా ఒకేచోట పెద్ద మొత్తంలో నాటి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తుంది. అడవి మాదిరిగా మొక్కలు పెరిగి పెద్ద వృక్షాలుగా మారేందుకు సంరక్షణ చర్యలు చేపడుతోంది. వెదురు, వేప, ఉసిరి, నేరేడు, పులిచింత, మారేడు, నారేప, వెలగ మొక్కలను పెంచుతోంది. వీటితో పాటు నిమ్మ, మామిడి, అల్లనేరేడు, సీతాఫలం లాంటి మొక్కలను కూడా పెంచి కార్మిక కుటుంబాలకు ఇళ్లలో నాటేందుకు అవసరం ఉన్న వారికి పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నారు.

వర్షాలు కురవగానే నాటేందుకు ఏర్పాట్లు

వర్షాలు కురవగానే మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఉపరితల గనుల ఓబీ డంప్‌యార్డులపై వృక్ష జాతికి చెందిన మొక్కలు నాటుతాం. వనాలను పెంపొందించేందుకు వెదురు, కానుగ లాంటి మొక్కలు నాటి సంరక్షిస్తాం. మొక్కలు నాటేందుకు ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నాం.డేవిడ్ అభిలాష్, సింగరేణి అటవీ విభాగం అధికారి

# టెండరు దాటని చెత్తశుద్ధి

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని 19 పురపాలికల డంపింగ్ యార్డుల్లో కొన్నేళ్లుగా వ్యర్థాలు గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు దుర్వాసనతోపాటు గాలి కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు గత భారాస ప్రభుత్వం పురపాలికల్లో బయోమైనింగ్ ప్లాంటు నిర్మించేందుకు నిర్ణయించింది. రాష్ట్ర స్థాయిలో 2022లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. అందులో భాగంగా నల్గొండలో ఓ గుత్తేదారు సంస్థ ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. నిర్మాణ పనులు ఆరంభ శూరత్వంగా మిగిలిపోయాయి.

కార్యరూపం దాల్చక పాట్లు


పట్టణాల్లో నిత్యం 450 టన్నులకు పైగా ఉత్పత్తి అవుతున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరించి వాహనాల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నులకు పైగా నిల్వ ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. కొన్ని పురపాలికల్లో డంపింగ్ యార్డులు నిండిపోవడంతో పోగైన వ్యర్థాలను దహనం చేస్తున్నారు. దీంతో వాతావరణం కలుషితమవుతోంది. పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగు కోసం వెచ్చిస్తున్న రూ.కోట్లు వృథా అవుతున్నాయి. స్థలం సరిపడక వ్యర్థాలను నిల్వ చేయడం కష్టంగా మారుతోంది. బయోమైనింగ్ అందుబాటులోకి వస్తే చెత్త నిల్వలను కనుమరుగు చేయవచ్చని అధికారులు భావించినా.. కార్యరూపం దాల్చకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది.

టెండర్ల ప్రక్రియ ఎప్పుడో.!

ఒక్కొక్క పురపాలిక సామర్థ్యాన్ని అనుసరించి బయోమైనింగ్ ప్లాంటు కోసం రూ.2 కోట్ల వరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రెండేళ్ల నుంచి అ నిధులు పురపాలికల బ్యాంకు ఖాతాల్లో మూలుగుతున్నాయి. గుత్తేదారు సంస్థను వివిధ కారణాలతో బ్లాక్‌లిస్టులో పెట్టి టెండర్లు రద్దు చేసినట్లు తెలిసింది. ఈ తరుణంలోనే రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరింది. కొత్త ప్రభుత్వం పురపాలికల్లో నిల్వ ఉన్న వ్యర్థాలపై దృష్టి సారించి బయోమైనింగ్ కోసం కొత్తగా టెండర్ల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం– ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలికబయోమైనింగ్ ప్లాంటు ఏర్పాటుకు టెండర్లు నిర్వహించే అంశం రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టిలో ఉంది. త్వరలోనే టెండర్లు చేపట్టే అవకాశం ఉంది. ప్లాంటు ఏర్పాటైతే వ్యర్థాలను శుద్ధిచేయొచ్చు. ఆ తర్వాత కొత్తగా పోగయ్యే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తాం. పొడి చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు బెంగళూరుకు చెందిన ఐటీస్మీ సంస్థతో ఇప్పటికే చర్చలు పూర్తి చేశాం. తడి చెత్తను బయోగ్యాస్ ప్లాంటుకు అందిస్తాం.

# 'సన్న'టి శుభవార్త..!

నల్గొండ : 'నూతన రేషన్‌కార్డుల మంజూరు త్వరలో ఉంటుందని, ఈ మేరకు రాష్ట్ర కేబినెట్ సమావేశంలో విధి విధానాలు రూపొందించినట్లు' రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తాజాగా వెల్లడించడంతో.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అంతేగాక రేషన్‌కార్డు దారులకు త్వరలో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రకటించడంతో పాత లబ్ధిదారుల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. వరుస ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున దరఖాస్తు చేసుకున్న అర్హులకు రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ హెూల్డ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. మంత్రి ప్రకటనతో ఆశావహుల ఎదురుచూపులకు తెరపడనుందని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలంటే ఆహారభద్రత కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందే. సుదీర్ఘ కాలంగా నూతన కార్డుల జారీ లేకపోవడంతో ఎందరో అర్హులు పథకాలకు దూరమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలకు రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో నిరుపేదలకి కార్డు లేని కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయనే వాదన వినిపిస్తుంది. పథకాలు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తెల్ల రేషన్‌కార్డు నిబంధన ప్రతిబంధకంగా మారుతుంది. గత ప్రభుత్వ హయాంలో కేవలం ఒక్కసారి మాత్రమే కొత్త రేషన్‌కార్డులు జారీ చేశారు. ఆ తర్వాత 2014 నుంచి కొత్తవి జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్డున్న లబ్ధిదారులకు నిత్యావసర సరకులు అందజేశారు.. దీంతో కార్డు లేని కుటుంబాల్లో అర్హులున్నప్పటికీ లబ్ధి పొందలేకపోయారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో ఆహారభద్రత కార్డుల ప్రక్రియ చేపడ్తామని ప్రకటించినప్పటికీ




సుమారు రెండు నెలలకు పైగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో మరింత జాప్యం జరిగిందనే చెప్పవచ్చు.

ప్రభుత్వ పథకాలకు దూరం..

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014లో అప్పటి ప్రభుత్వం ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి.. దాని ప్రకారం ఒకసారి రేషన్ కార్డులు, పింఛన్లు జారీ చేశారు. ఆ తర్వాత కొత్తవాటి జోలికి వెళ్లలేదు. 2022 ఆగస్టులో కొందరికి మాత్రమే కార్డులు పంపిణీ చేశారు. ప్రస్తుతం చాలా కుటుంబాల్లో సోదరులు విడిపోయి వేరే కాపురాలు పెట్టడం, తల్లిదండ్రులతో కాకుండా వేరుగా ఉండటం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. కానీ కొందరు పురుషుల పేర్లు తల్లిదండ్రుల కార్డుల్లోనే ఉండటం.. వారి భార్యాపిల్లల పేర్లు పొందుపరిచే అవకాశం కల్పించలేదు.ఆ కుటుంబాలకు పథకాలు అందడం లేదు. దీనికితోడు కార్డుల్లో మార్పులకు వెసులుబాటు కల్పించక పోవడంతో వేలాది మంది పేదలు స్థానికంగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తాజాగా మంత్రి ప్రకటనతో సదరు దరఖాస్తులకు మోక్షం కలిగే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. తక్షణమే సంబంధిత దరఖాస్తులపై అధికారుల క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అర్హులకు త్వరగా కార్డులను అందించాలని కోరుతున్నారు.

# ఆక్రమణలో 640 ఎకరాలు

భువనగిరి : ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చెందిన సుమారు 640 ఎకరాల దేవుని మాన్యం భూములు దశాబ్దాల తరబడి ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ గ్రామంలో 591 సర్వే నంబరుతో ప్రారంభమయ్యే దేవునిమాన్యం 703 సర్వేనంబర్ల వరకు విస్తరించి ఉంది. 71, 72, 73 సర్వే నంబర్లలోనూ కొద్ది విస్తీర్ణంలో దేవుడి భూమి ఉంది. కిచ్చనపాడు చంద్రిక పేరుతో పట్టా ఉన్న ఈ భూములపై ఇప్పటి వరకు వేలం పాటలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఒకవేళ నిర్వహించాలని ప్రయత్నం చేసినా గొడవలు జరిగిన సందర్భాలున్నాయి. పైగా ఆలయ భూముల్లోనే ఇళ్లతోపాటు ఇతర నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వానికి నయాపైసా ఆదాయం రావడం లేదు.

నోటీసులు ఇచ్చినా స్పందన శూన్యం

కందగట్ల గ్రామ శివారులోని మంగళితండా, వీర్యానాయక్‌తండా, జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి, నూతనకల్ మండలం బక్కహేమ్లాతండా తదితర గ్రామాల పరిధిలో ఈ దేవుని మాన్యం విస్తరించి ఉంది. ప్రస్తుతం ఆ భూములన్నీ ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. ఇటీవల దేవుని మాన్యం భూములను రైతులకే లీజుకిచ్చి కౌలు వసూలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనిలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు జిల్లాలోని దేవుని మాన్యం భూములున్న చోట లీజు నోటీసులు జారీ చేస్తున్నారు. కందగట్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూములకు సైతం నోటీసులు జారీ



చేశారు. మే చివరి వారంలో గ్రామసభలు నిర్వహించి ఆయా గ్రామాల రైతులతో చర్చలు జరిపారు. గత కొన్నేళ్లుగా రైతులే అక్రమంగా సేద్యం చేస్తున్నారని, ఈసారి కౌలు చెల్లించాలని స్పష్టంచేశారు. అయినా రైతుల్లో స్పందనలేదు. మరోవైపు తాత, ముత్తాతల కాలం నుంచి కబ్జాలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నామని, తమకు అధికారికంగా పట్టాలు ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధూపదీప నైవేద్యానికి పాట్లు

2018 నుంచి ఈ ఆలయానికి పాలక మండలి లేదు. వందల ఎకరాల భూములకు కౌలు రావడం లేదు. ఆదాయం లేకపోవడంతో ఆలయంలో ధూపదీప నైవేద్యం కరవవుతోంది. దాతల సాయంతోనే ఆలయంలో అప్పుడప్పుడు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

# ఎస్సెల్బీసీపై ఆశలు చిగురింత

దేవరకొండ : నల్గొండ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం ఎస్సెల్బీసీ టన్నెల్ ప్రాజెక్టు పనులను ఈ నెలలో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తులు మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్సెల్బీసీపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా ఎమ్మెల్యేలతో అనేక పర్యాయాలు ప్రాజెక్టుపై సమీక్ష జరిపారు. ప్రాజెక్టు పనులకు అవరోధం లేకుండా ఉండేందుకు నీటిపారుదలశాఖ అధికారులతో కమిటీ సైతం నియమించారు. ఈ మేరకు నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష జరిపి పనులు చేపట్టాలని వారికి అభయం ఇవ్వడంతో నిర్వాహకులు టన్నెల్ పనులకు ఈ నెలలో ప్రారంభించేందుకు ముహూర్తం కుదిర్చారు. ఔట్‌లెట్ వైపు ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ బేరింగ్‌లు మరమ్మతులు ఏర్పడడం, నిధుల లేమితో 19 నెలలుగా పనులు నిలిచిపోయాయి. 2005లో ప్రారంభించిన పనులు తరచూ ఆటంకం నెలకొంటూ వస్తున్నాయి. 43.93 కిలోమీటర్లు టన్నెల్ తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ 19 ఏళ్లు గడిచినా కేవలం 34.37 కిలోమీటర్లు పూర్తయింది. మిగిలిన 9.56 కిలోమీటర్లు తవ్వితే గ్రావిటీతో నీటిని ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించేందుకు వీలు అవుతుంది. అక్టోబరు కల్లా మరమ్మతులు పూర్తి చేసుకొని టీబీఎం మిషన్ సిద్ధంగా ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.




సున్నిపెంట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలు జిల్లా సున్నిపెంటలో నిర్వహించిన 'మన నీరు–మన సంపద' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుపై స్పందించారు. "సామాజిక న్యాయం, దామాషా ప్రకారం ప్రతి వర్గానికి న్యాయం చేయడం తెదేపా సిద్ధాంతం. గతంలో వర్గీకరణకు సంబంధించి ఏబీసీడీలుగా కేటగిరీ తీసుకొచ్చాను. అందరికీ న్యాయం జరగాలి. ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు కూడా అలాగే చేశాం. ఈ ప్రభుత్వం అందరిది.. మీ అందరివాడిగా ఉంటా" అని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని సీఎం విమర్శించారు. ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత తనదని చెప్పారు. సంపద సృష్టితో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## కులాల మధ్య చిచ్చు పెట్టి కుల రాజకీయం చేసిన వ్యక్తి జగన్..



అమరావతి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల చిరకాల పోరాటానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు ఎప్పుడూ సానుకూలంగానే వ్యవహరించారన్నారు. సామాజిక న్యాయం పాటించే పేటెంట్ హక్కు టీడీపీదేనని మరోసారి స్పష్టమైందని ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టి కుల రాజకీయం చేసిన వ్యక్తి జగన్ అని ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. మాదిగలను కేవలం తన ఓటు బ్యాంకుగానే జగన్ చూశారు తప్ప ఏనాడూ వర్గీకరణపై మాట్లాడలేదని పేర్కొన్నారు. వర్గీకరణ కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మాదిగలకు సుప్రీం తీర్పు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. దళితులంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. మాదిగలకు రాజ్యాంగ ఫలాలు అందాలన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. ఇవాళ న్యాయం గెలిచిందని తెలిపారు. మా ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం గెలిచిందని ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది. గురువారం నాడు వర్గీకరణపై సుదీర్ఘ విచారణ జరిపిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమర్థనీయమని స్పష్టం చేసింది.

కాగా.. ఈ వర్గీకరణను మెజారిటీ సభ్యులు సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఎస్సీలు చాలా వెనుకబడిన వర్గాలుగా ఉన్నారని.. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వర్గీకరణ అవసరం ఉందని.. వర్గీకరణచేసే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండాలని సుప్రీం స్పష్టం చేసింది. ఈ మేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజా తీర్పు తర్వాత ధర్మాసనం పక్కనబెట్టింది.

ఈ తీర్పును అనుసరించి తదుపరి మార్గదర్శకాలను అనుసరించాలని ప్రభుత్వాలకు న్యాయస్థానం సూచించింది.

## ఏపీ అప్పులపై నిజనిర్ధారణ కమిటీకి చింతామోహన్ డిమాండ్



నెల్లూరు, ఆగస్టు 1: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాడు కలక్టరేట్ ఎదుట మాజీ కేంద్ర మంత్రి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ అయిదేళ్ల పాలనలో ఏపీకి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆర్థిక, రెవెన్యూ వ్యవస్థలని నాశనం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర విభజనకు ఏపీలో ఒక కుటుంబం, తెలంగాణలో ఒక కుటుంబమే కారణమన్నారు. అక్కడ కుటుంబం పదేళ్లు పాలించి రూ.వేలకోట్లు సంపాదించిందని విమర్శించారు. ఏపీలో కూడా ఒక కుటుంబము పదేళ్లుకి పైగా పాలించి రూ.వేల కోట్లు దోచుకుందని మండిపడ్డారు. ఆ రెండు కుటుంబాల ధన దాహం, అధికార దాహం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోని 9 కోట్ల ప్రజలు నష్టపోయారన్నారు. ఏపీ అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఏపీకి రూ.7 లక్షల కోట్లు అప్పు అని వైఎస్ జగన్ అంటే, పయ్యావుల కేశవ్ రూ.13.5 లక్షల కోట్లు అప్పు ఉందని అన్నారని తెలిపారు. వారిద్దరిలో ఎవరు చెప్పింది నిజమో తేలాలన్నారు. అందుకు ఏపీ అప్పులపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకి నలుగురు సీఎంల హయాంలో ఎంత నిధులు ఇచ్చారని ప్రశ్నించారు. ఎవరెవరు కాంట్రాక్టర్లకి ఇచ్చారు అన్న దానిపై జ్యూడీషియల్ విచారణ జరపాలన్నారు. ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో గ్రాంటుగా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు ఇప్పిస్తామని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారని తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఏపీ రాజధానికి అప్పు ఇవ్వదన్నారు. వారి నిబంధనలకి విరుద్ధమని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు అంటూ చింతా మోహన్ వ్యాఖ్యలు చేశారు.



## ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని ఆనాడు కన్నీళ్లతో చెప్పా...

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ స్పందించారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడుతూ... గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు చేసిన ఎస్సీ వర్గీకరణపై ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు అది ఏపీలో అమలు అవుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతుందన్న నమ్మకం తమకు ఉందని తెలిపారు. నాటి సందర్భంలో సీఎంగా ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు నాయుడు అమలు చేశారని గుర్తుచేశారు.

సుప్రీంకోర్టు న్యాయం వైపు తీర్పు చెప్పిందని.. ధర్మమే గెలిచిందన్నారు. అధర్మం తాత్కాలికంగా గెలిచినా ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని ఆనాడు కన్నీళ్లతో ఇక్కడి నుంచి వెళ్లిపోయామని అన్నారు. ఈ విజయం కోసం 30 ఏళ్లు తపనతో కూడిన పోరాటం చేసామన్నారు. ఈ 30 ఏళ్ల పోరాటంలో అమరులయిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి బిడ్డలకు ఈ విజయం అంకితం చేస్తున్నామన్నారు. ఉద్యమాన్ని దెబ్బతీసే కుట్రలు జరిగాయని.. కొంతమంది వెన్నుపోటు పొడిచారన్నారు. సమాజం యావత్తు మాదిగల వైపు నిలబడిందన్నారు. ఎన్నో రాజకీయ పార్టీలు, వ్యక్తులు తమ వైపు నిలబడ్డారన్నారు. న్యాయాన్ని, ధర్మాన్ని బతికించడం కోసం తమ వైపు నిలబడ్డ అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజంలో పెద్దలు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. అణగారిన వర్గాల వైపు, పేద వర్గాలవైపు న్యాయం నిలబడిందన్నారు. ప్రధాన న్యాయమూర్తులతో పాటు, ఇతర న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అండగా నిలబడ్డ ప్రధాని మోడీ, అమిత్ షా, భుజాన వేసుకుని తమవైపు ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలకు ధన్యవాదాలు చెప్పారు. సుప్రీంకోర్టు తాజా తీర్పును తెలుగు రాష్ట్రాల్లో విద్యా, ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలన్నారు. ప్రభుత్వాల దగ్గర ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు ఉన్నాయి కాబట్టి ప్రస్తుతం ఉన్న ఉద్యోగ నియామకాల్లో కూడా అమలు చెయ్యాలని కోరారు. వర్గీకరణకు సంబంధించిన జీవోలు వచ్చిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని... ఉద్యోగ నోటిఫికేషన్లు సరిచేసుకోవాల్సిన అవసరం ఉందని.. రీ–నోటిఫికేషన్లు ఇవ్వాలని మందకృష్ణ మాదిగ కోరారు.




## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం.. 10 గేట్లు ఎత్తివేత

శ్రీశైలం ఆలయం: శ్రీశైలం జలాశయానికి క్రమంగా వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో 10 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 3,17,940 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలైన జూరాల, సుంకేసుల నుంచి 3,42,026 వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.50 అడుగులుగా నమోదైంది. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 212.9197 టీఎంసీలు ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 60 వేల క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు 25 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.




## వయనాడ్ విషాదం.. మట్టిదిబ్బల కిందే ఇంకా 240 మంది

వయనాడ్: కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి సృష్టించిన పెను విపత్తు ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలను నేలమట్టం చేసిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విలయంలో మృతుల సంఖ్య 277కు చేరినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మరో 200 మందికి పైగా గాయపడినట్లు తెలిపాయి. ఇంకా 240 మంది ఆచూకీ తెలియరాలేదు. సోమవారం అర్ధరాత్రి భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడటంతో మండక్కై, చూరాల్‌మల ప్రాంతాలు నామరూపాల్లేకుండా ధ్వంసమైన సంగతి తెలిసిందే. దీంతో ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగాయి. వర్షాల కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ వరుసగా మూడో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు వేలాది మందిని రెస్క్యూ సిబ్బంది కాపాడి సురక్షిత శిబిరాలకు తరలించారు. బండరాళ్లు పడి అనేక ఇళ్లు నేలమట్టం కావడంతో వాటి కింద ప్రజలు నలిగిపోయారు. బాధితులను గుర్తించేందుకు ఆర్మీ జాగిలాలతో అన్వేషిస్తున్నారు.

**వయనాడ్ చేరుకున్న రాహుల్, ప్రియాంక గాంధీ :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ గురువారం ఉదయం వయనాడ్ చేరుకున్నారు. సహాయక శిబిరాలు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను వీరు పరామర్శించరు. అనంతరం కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అటు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఈ ఉదయం వయనాడ్ వెళ్లి విపత్తు పరిస్థితిపై సమీక్షించారు.

## వారి ఆనందమే కూటమి సర్కార్‌కు వెలకట్టలేని బహుమానం



అమరావతి, ఆగస్టు1: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జరుగుతోంది. వేకువజాము నుంచే ఎమ్మెల్యేలు, అధికారులు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందజేస్తున్నారు. ఈ సందర్భంగా పెన్షన్ల పంపిణీపై విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. "ఒకటో తేదీ తెల్లవారి ఆరు గంటలకే పెంచిన పింఛను రూ.4000 ఇంటి వద్దే అందుకున్న అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులే మా కూటమి ప్రభుత్వానికి దీవెనలు. పింఛన్లు అందుకున్న ఒంటరి మహిళలు, దివ్యాంగులు చెబుతున్న కృతజ్ఞతలే మాకు ఆశీస్సులు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకున్న లక్షలాదిమంది వ్యక్తం చేసిన ఆనందమే కూటమి ప్రభుత్వానికి అందిన వెలకట్టలేని బహుమానం" అంటూ లోకేష్ ట్వీట్ చేశారు.

**మాటకు కట్టుబడి పెన్షన్ల పంపిణీ: కదిరి ఎమ్మెల్యే –** గతంలో మాట తప్పను అని ప్రగల్భాలు పలికిన వైఎస్ జగన్ వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు సమయం తీసుకున్నారని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాటకు కట్టుబడి పెంచిన పెన్షన్లను అందజేస్తున్న ఘనత చంద్రబాబుదే అని చెప్పుకొచ్చారు. ప్రజల మధ్య పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదల కోసం పరితపిస్తున్న సీఎం చంద్రబాబు అని అన్నారు. లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం ప్రస్ఫుటంగా కనబడుతోందన్నారు. ఎన్టీఆర్ భరోసా చరిత్రలో నిలవబోతున్నదని తెలిపారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు ప్రభుత్వం మనోధైర్యం కల్పిస్తోందన్నారు. 55 రోజుల్లో రెండోసారి పెన్షన్ పంపిణీతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రంలో పరిపాలన బావుంటుందని ప్రజలు గ్రహించారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వందకు వంద శాతం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం,అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెంకట ప్రసాద్ పేర్కొన్నారు.

అలాగే... కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని పలు వార్డులలో ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. జగన్ ఐదేళ్లు అధికారంలో ఉండి లక్షల కోట్లు విధ్వంసం చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వం లో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చి ప్రజల్లో ఆనందం నింపుతారని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఇక ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్ పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గంలో ఉదయం 6.00 గంటల నుంచే ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## అవ్వాతాతల కళ్లలో ఆనందం చూస్తున్నాం: పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదును అందజేస్తున్నారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పంపిణీ చేశారు. నెల్లూరు 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో మంత్రి నారాయణ పింఛన్లు అందజేశారు. అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నట్లు ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారమే ఇంటి వద్దకే వెళ్లి ఇస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అనురాధ ప్రారంభించారు.

## శ్రీశైల మల్లన్న సేవలో సీఎం చంద్రబాబు



శ్రీశైలం ఆలయం: ఏపీ సీఎం చంద్రబాబు శ్రీశైలంలోని మల్లన్న ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలిచ్చారు. నేడు చంద్రబాబు శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. మడకశిర మండలంలో పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

ఉదయం సున్నిపెంటకు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం చంద్రబాబుకు మంత్రులు నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, గొట్టిపాటి రవికుమార్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

## టెన్నిస్ డ్రెస్సులో ఐషా పాప.. హై గ్లామర్ డోస్


చిరుత సినిమాలో నటించిన నేహా శర్మని ఎవ్వరు అంత ఈజీగా మర్చిపోరు. మొదటి సినిమాతోనే నేహా శర్మ అటు గ్లామర్, ఇటు నటనతో మెప్పించింది. తరువాత నేహా శర్మకి తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. బాలీవుడ్ లోకి అడుగుపెట్టి అక్కడ అడపాదడపా సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తోంది. ఇక నేహా శర్మ చెల్లెలు ఐషా శర్మ కూడా అక్క దారిలోనే నటిగా బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. మోడల్ గా కెరియర్ స్టార్ట్ చేసిన ఐషా శర్మ తరువాత 2018లో జాన్ అబ్రహం హీరోగా తెరకెక్కిన సత్యమేవ జయతే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఆ మూవీతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే తరువాత ఐషా శర్మకి పెద్దగా




అవకాశాలు రాలేదు. 2022లో షైనింగ్ విత్ సర్మాస్ అనే వెబ్ సిరీస్ లో కూడా నటించింది. అలాగే ఇప్పటి వరకు మూడు మ్యూజిక్ వీడియోస్ లలో కూడా ఈమె సందడి చేసింది. హీరోయిన్ గా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయిన ఐషా శర్మ సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటోంది. ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా ఫోటోలని, అప్డేట్స్ ని షేర్ చేస్తూ ఉంటుంది. ఈ బ్యూటీకి ఇన్ స్టాగ్రామ్ లో 6.8 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. అందుకే ఎలాంటి ఫోటోలని షేర్ చేసిన లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. అక్క నేహా శర్మ ఇన్ ఫ్ల్యూయెన్స్ ఐషా శర్మ మీద ఎక్కువగానే ఉన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు గ్లామర్ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో ఈ బ్యూటీ షేర్ చేస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా టెన్నిస్ కోర్టులో టెన్నిస్ స్పోర్ట్స్ స్టార్స్ వేసే స్కర్ట్, జాకెట్ తో ఐషా శర్మ ఫోటోలకి ఫోజులిచ్చింది. ఈ ఫొటోస్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ కాస్ట్యూమ్స్ తో ఐషా శర్మ అచ్చం టెన్నిస్ స్పోర్ట్స్ గర్ల్ లా ఉందనే కామెంట్స్ నెటిజన్ల నుంచి వినిపిస్తున్నాయి.

## డబుల్ ఇస్మార్ట్ డబ్బుల టెన్షన్.. ఏమవుతుందో..?

టాలీవుడ్ స్టార్ హీరో రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో తెరకెక్కుతున్న డబుల్ ఇస్మార్ట్ మూవీ రిలీజ్ కు సర్వం సిద్ధమవుతోంది. ఆగస్టు 15వ తేదీన వరల్డ్ వైడ్ గా పాన్ ఇండియా లెవెల్ లో విడుదల చేసేందుకు మేకర్స్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ సినిమాతో మంచి హిట్ కొట్టాలని అటు పూరి.. ఇటు రామ్ చూస్తున్నారు. ఇద్దరికీ ఇప్పుడు హిట్ బాగా అవసరం. అదే సమయంలో సినిమాపై ఆడియన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. అయితే డబుల్ ఇస్మార్ట్ రిలీజ్ అవుతున్న నేపథ్యంలో.. కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఓ చర్చ జరుగుతోంది. పూరి డైరెక్ట్ చేసిన లైగర్ టైమ్ లో జరిగిన విషయం బయటకొస్తుందోమోనని కొందరు అనుమానిస్తున్నారు. మరికొందరు మాత్రం పూరీ, ఛార్మి తగిన చర్యలు తీసుకుని డబుల్ ఇస్మార్ట్ రిలీజ్ చేస్తున్నారని అంటున్నారు. కానీ ఇప్పుడు డిస్ట్రిబ్యూటర్ వరంగల్ శ్రీను పేరు వినిపిస్తోంది. లైగర్ థియేట్రికల్ హక్కులను కొని భారీగా నష్టపోయిన ఆయన పేరు ట్రెండింగ్ లోకి వచ్చింది. పూరి జగన్నాథ్, విజయ్ దేవరకొండ క్రేజ్ ను దృష్టిలో పెట్టుకుని వరంగల్ శ్రీను.. నో రిటర్న్



అగ్రిమెంట్ ద్వారా లైగర్ డీల్ సెట్ చేసుకున్నారు. అయితే ఆ సినిమా ఎలాంటి ఫ్లాప్ అయిందో తెలిసిందే. దీంతో ఎగ్జిబిటర్లు భారీగా నష్టపోయారు. ఆ తర్వాత తమకు డబ్బులు ఇవ్వాలని మేకర్స్ ను అడిగారు. కానీ వరంగల్ శ్రీను తనకే ఇవ్వండని కోరారు. దీంతో మీరు మీరు తేల్చుకోండని ఊరుకున్నారు పూరి జగన్నాథ్. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే డబుల్ ఇస్మార్ట్ మూవీతో నైజాం థియేటర్ల యజమానులు తమ నష్టాలను పూడ్చుకునేందుకు చూస్తున్నారు. అందుకు గాను ఏం చేయాలనే విషయంపై చర్చించారు. డిస్ట్రిబ్యూటర్ వరంగల్ శ్రీను కూడా లైగర్ ఎగ్జిబిటర్లను కలిశారు. అందరూ తనకు సపోర్ట్ చేస్తే తమ నష్టాలను కవర్ చేసుకునే ప్రయత్నం చేద్దామని వరంగల్ శ్రీను చెప్పినట్లు తెలుస్తోంది. అందుకు ఎగ్జిబిటర్లు కూడా ఓకే చెప్పినట్లు సమాచారం. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక లైగర్ రిలీజ్ సమయంలో నాన్ రిటర్న్ బుల్ అడ్వాన్స్ పద్ధతిలో సినిమా హక్కులను కొనుగోలు చేయడం లీగల్ గా కూడా క్లియర్ అవ్వలేదు. పూరి, ఛార్మి వరంగల్ శ్రీనుకు డబ్బులు ఇవ్వాలో? లేక ఎగ్జిబిటర్లకు ఇవ్వాలో తేల్చుకోలేక సైలెంట్ అయ్యారు. దీంతో ఎవరికీ చెల్లించలేదు. ఇప్పుడు డబుల్ ఇస్మార్ట్ రిలీజ్ టైమ్ లో అంతా ఒక్కటై పోరాడేందుకు డిసైడ్ అయినట్లు ఒక టాక్ అయితే వైరల్ అవుతోంది. మరి టాక్ ఎంతవరకు నిజమో తెలియాలి అంటే అఫీషియల్ క్లారిటీ వచ్చే వరకు ఎదురుచూడాల్సిందే.





## ప్రభాస్ - ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్!



టాలీవుడ్ స్టార్ హీరోలంతా ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. నేషనల్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకొని, మార్కెట్ విస్తరించుకోడానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే ప్రభాస్, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి హీరోలు పాన్ ఇండియన్ స్టార్ డమ్ అందుకున్నారు. అయితే వీరిలో నిజమైన పాన్ ఇండియా స్టార్ ఎవరనే విషయం మీద సోషల్ మీడియాలో తరచుగా ఫ్యాన్ వార్స్ జరుగుతూ ఉంటాయి. మిగతా హీరోలంతా డైరెక్టర్ ఎస్. ఎస్. రాజమౌళి అండతో స్టార్ డమ్ సాధించారని, ఆయన సపోర్ట్ లేకుండానే 'పుష్ప'తో సత్తా చాటిన బన్నీనే ఒరిజినల్ పాన్ ఇండియా స్టార్ అని ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తుంటారు. RRR సినిమాతో గ్లోబల్ ఆడియెన్స్ దృష్టిని ఆకర్షించడమే కాదు, భారతీయ చిత్ర పరిశ్రమకు వందేళ్ల నాటి ఆస్కార్ అవార్డ్ కలను సాకారం చేసిన పెట్టిన ఎన్టీఆర్, రామ్ చరణ్ లు అసలైన పాన్ ఇండియా స్టార్స్ అని వాళ్ళ అభిమానులు అంటుంటారు. 'బాహుబలి' చిత్రంతో తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్ళి, పాన్ ఇండియాకి బాటలు వేసిందే ప్రభాస్ అని డార్లింగ్ ఫ్యాన్స్ అభిప్రాయ పడుతుంటారు. 'బాహుబలి 2' తో ఆయన క్రియేట్ చేసిన రికార్డులను ఇప్పటికీ ఎవరూ అందుకోలేకపోతున్నారని, 'కల్కి' మూవీతో రాజమౌళి మద్దతు లేకుండానే ?1000 కోట్లు కొట్టి చూపించాడని కామెంట్లు చేస్తుంటారు. అంతేకాదు ప్రభాస్ ఒక్కడే తన క్రేజ్ ను కాపాడుకునేలా సినిమాలు చేస్తున్నారని, బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ తో ఇండస్ట్రీని కాపాడుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

నిజానికి ప్రభాస్ నుంచి గత రెండేళ్లలో నాలుగు పాన్ ఇండియా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటిల్లో 'సలార్ 1', 'కల్కి 2898 AD' సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్టయితే, 'రాధే శ్యామ్' 'ఆదిపురుష్' చిత్రాలు ఫ్లాప్ అయ్యాయి. అదే సమయంలో 'పుష్ప: ది రైజ్' తర్వాత అల్లు అర్జున్ ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రాలేదు. ఈ ఏడాది డిసెంబర్ లో 'పుష్ప: ది రూల్' రిలీజ్ అవుతుంది. అంటే బన్నీ నుంచి దాదాపు మూడేళ్ళకు ఇంకో సినిమా వచ్చినట్లు అవుతుంది. అలానే RRR తర్వాత ఎన్టీఆర్ నుంచి మరో మూవీ రాలేదు. రామ్ చరణ్ మాత్రం 'ఆచార్య' వంటి మల్టీస్టారర్ లో నటించారు కానీ, సోలోగా ఒక్క మూవీ కూడా రిలీజ్ చెయ్యలేదు. ఈ విధంగా వర్క్ విషయంలో కంపేర్ చేసి చూస్తే, ప్రభాస్ మిగతా హీరోల కంటే ముందున్నారని చెప్పాలి. పర్ఫెక్ట్ గా ప్లానింగ్ చేసుకొని సినిమాలు పూర్తి చేస్తున్నారు.. అనుకున్న సమయానికి వాటిని విడుదల చేస్తున్నారు. మరికొన్ని ప్రాజెక్ట్స్ ను లైన్ లో పెడుతున్నారు. రిజల్ట్ ఎలా ఉందనేది పక్కన పెడితే, పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వడం వల్ల రెవెన్యూ జెనరేట్ అవుతుంది. ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర నుంచి థియేటర్ క్యాంటీన్ల వరకూ అందరూ లాభ పడతారు. అదే జరిగితే ఇండస్ట్రీ కళకళలాడుతుంది. ఇటీవల 'కల్కి' సినిమా వల్ల కరెంట్ బిల్లులు కట్టుకోలేని స్థితికి వెళ్లిపోయిన ఎన్నో థియేటర్లను రీ ఓపెన్ చేశారు. మంచి విజయం సాధించడంతో సినిమాతో సంబంధం ఉన్న పార్టీలన్నీ లాభ పడ్డాయి. కాబట్టి వరుసగా నాలుగు సినిమాలను విడుదల చేసిన ప్రభాసే ఇప్పటికి నిజమైన 'పాన్ ఇండియా స్టార్' అనుకోవచ్చు.

## గేమ్ ఛేంజర్.. 'కియారా' కెవ్వు కేక!




ప్రామిసింగ్ యాక్ట్రెస్ గా సక్సెస్ ఫుల్ సినిమాలతో దూసుకుపోతున్న హీరోయిన్ కియారా అద్వాణీకి సూపర్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం ఫగ్లీ మూవీతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ముద్దుగుమ్మ. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు భరత్ నేను మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు అటు హిందీ.. ఇటు తెలుగులో బిజీ బిజీగా గడుపుతోంది. మ్యారేజ్ అయ్యాక వచ్చిన అవకాశాలు అన్నీ అందుకుని ప్రాజెక్టులపై సైన్ చేస్తోంది కియారా. గత ఏడాది సత్యప్రేమ్ కి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కియారా.. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న వార్-2లో నటిస్తోంది. ఇక సౌత్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ లో యాక్ట్ చేస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ బ్లాక్ బస్టర్ హిట్ మూవీ సలార్ సీక్వెల్ లో నటించనుందట. స్పెషల్ సాంగ్ తోపాటు కీలక పాత్రలో కనిపించనుందని టాక్ వినిపిస్తోంది. అయితే నేడు కియారా బర్త్ డే. దీంతో సోషల్ మీడియాలో ఆమెకు విషెస్ వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో గేమ్ ఛేంజర్ మేకర్స్.. కియారాకు పుట్టినరోజు విషెస్ తెలిపారు. "గేమ్ ఛేంజర్ టీమ్ తరఫున జాబిలమ్మ కియారా అద్వాణీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆమె వైబ్రంట్ ఎనర్జీ త్వరలో మీ హృదయాలను మంత్రముగ్ధులను చేస్తుంది" అని ట్వీట్ చేశారు. దాంతోపాటు స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అయితే పోస్టర్ లో శంకర్ మార్క్ క్లారిటీగా కనిపిస్తుందనే చెప్పాలి. క్రేజీ లెహంగా వేసుకున్న కియారా చాలా అందంగా కనిపిస్తోంది. డ్రెస్సింగ్ అదిరిపోయింది. బ్యాక్ గ్రౌండ్ లోని విజువల్స్.. సూపర్ గా ఉన్నాయి. ఇప్పటికే గేమ్ ఛేంజర్ నుంచి రిలీజ్ అయిన జరగండి సాంగ్ లోని స్టిల్ నే మేకర్స్ విడుదల చేశారు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా కొన్ని రోజుల క్రితమే మేకర్స్ రిలీజ్ చేసిన జరగండి పాట.. మాస్ ఆడియన్స్ ను ఆకట్టుకుంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందించగా.. ఈ మూవీని దిల్ రాజు ప్రొడ్యూస్ చేస్తున్నారు. అయితే గేమ్ ఛేంజర్ మూవీ రిలీజ్ డేట్ కోసం ఇప్పుడు అంతా వెయిట్ చేస్తున్నారు. అక్టోబర్ లో రిలీజ్ అవుతుందని అంతా భావించినా.. ఇటీవల దిల్ రాజు క్రిస్మస్ కు కలుద్దామంటూ హింట్ ఇచ్చారు. దీంతో డిసెంబర్ 25వ తేదీన గేమ్ ఛేంజర్ విడుదల అవ్వనుందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే రామ్ చరణ్ తన పార్ట్ కంప్లీట్ చేసుకోగా.. కొద్ది రోజుల్లో షూటింగ్ మొత్తం పూర్తి కానుంది. అయితే సౌత్ లో సత్తా చాటాలనుకుంటున్న కియారా ఈ సినిమాతో ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.

## టాలీవుడ్ కి ఏం కావాలో తెలుసుకుని వచ్చినట్టుంది !

టాలీవుడ్ లో సక్సెస్ అవ్వడం అంటూ జరిగింది అంటే ఆ హీరోయిన్ కి పాన్ ఇండియా రేంజ్ రావడం పక్కా.. ఎక్కడ నంచి వచ్చినా సరే తెలుగులో స్టార్ సినిమా ఛాన్స్ అందుకుంటుంది అంటే చిన్నగా ఆ హీరోయిన్ సౌత్ లో టాప్ ప్లేస్ కి వెళ్తుంది. అక్కడ నుంచి బాలీవుడ్ లో కూడా ఛాన్సులు అందుకుంటుంది. అందుకే హీరోయిన్స్ అంతా కూడా టాలీవుడ్ ఆఫర్ అనగానే మరో మాట మాట్లాడకుండా ఓకే చేస్తారు. ఈ క్రమంలో కరెక్ట్ గా టాలీవుడ్ లో ఎలా ఉండాలి.. ఇక్కడ ఆడియన్స్ కు ఏం కావాలి అని తెలుసుకుని మరీ అడుగు పెట్టింది భాగ్య శ్రీ బోర్స్. రవితేజ లాంటి హీరో సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ అంటే అది చాలా లక్కీ అన్నట్టే లెక్క. అది కూడా హరీష్ శంకర్ లాంటి డైరెక్టర్ సినిమా అంటే ఇక నో డౌట్ అన్నట్టే. తన సినిమాలో నటించిన హీరోయిన్స్ కి మంచి లైఫ్ ఇస్తూ వారి ఇమేజ్ డబుల్ అయ్యేలా చేస్తాడు హరీష్ శంకర్. అలాంటి హరీష్ శంకర్ డైరెక్షన్ లో మాస్ రాజా రవితేజ హీరోగా చేస్తున్న సినిమాతో తెలుగు తెరకు పరిచయమవుతుంది భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో రెండు



ప్రాజెక్ట్ లు చేసి సందడి చేసిన అమ్మడు టాలీవుడ్ నుంచి ఆఫర్ అనగానే నెక్స్ట్ థాట్ లేకుండా ఓకే చెప్పేసింది. తెలుగులో మాస్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్స్ కు మంచి పాపులారిటీ ఉంటుంది. మిస్టర్ బచ్చన్ తో యాక్టింగ్ తో ఇంప్రెస్ చేస్తూనే గ్లామర్ విషయంలో కూడా తగ్గలేదనిపిస్తుంది భాగ్య శ్రీ బోర్స్. హరీష్ టేకింగ్ భాగ్య శ్రీ అందాలు రవితేజ మాస్ మేనియా ఇది చాలు ఆడియన్స్ పండగ చేసుకుంటారు. ఈమధ్యనే మిస్టర్ బచ్చన్ టీజర్ రిలీజ్ టైం లో డ్యాన్స్ తో కూడా ఆడియన్స్ ని మెప్పించే ప్రయత్నం చేసింది భాగ్య శ్రీ. సో ఇక్కడ తన కెరీర్ సెట్ చేసుకోవాలని గట్టిగా ఫిక్స్ అయ్యే అమ్మడు వచ్చిందని ఆమె చేస్తున్న యాక్టివిటీస్ వల్ల తెలుస్తుంది. మిస్టర్ బచ్చన్ సెట్స్ మీద ఉండగానే విజయ్ దేవరకొండతో ఛాన్స్ అందుకుంది. మిస్టర్ బచ్చన్ అనుకున్న విధంగానే హిట్ పడితే మాత్రం అమ్మడికి మరిన్ని ఛాన్సులు వస్తాయి. సో కరెక్ట్ టైం లో కరెక్ట్ సినిమాతో భాగ్య శ్రీ టాలీవుడ్ ఎంట్రీ అమ్మడి కెరీర్ గ్రాఫ్ ని ఒక రేంజ్ కి తీసుకెళ్తుందని చెప్పొచ్చు.

## అల్లు అర్జున్ - శిల్పా రవి.. నిహారిక ఏం చెప్పిందంటే..

ఏపీలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అఖండ విజయాన్ని అందుకుంది. 100 శాతం స్ట్రైక్ రేట్ తో పోటీ చేసిన అన్ని స్థానాలలో జనసేన పార్టీ గెలుపొందింది. ఇదిలా ఉంటే ఎన్నికల ప్రచారం చివరి రోజున అల్లు అర్జున్ నంద్యాలలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డిని గెలిపించాలని క్యాంపైన్ చేశారు. ఆ క్యాంపైన్ జనసేన అభిమానులకి, మెగా ఫ్యాన్స్ కి కోపం తెప్పించింది. కావాలనే అల్లు అర్జున్ వైసీపీ అభ్యర్థి కోసం ప్రచారం చేశారనే విమర్శలు మొదలు పెట్టారు. ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడిచింది. ఎన్నికల తర్వాత నాగబాబు పెట్టిన ఒక ట్వీట్ కూడా ఈ కాంట్రవర్సీని మరింత పైకి తీసుకెళ్లింది. ట్వీట్ చేసిన కొన్ని గంటల తర్వాత మరల దానిని డిలేట్ చేశారు. అయిన ఈ వివాదం మాత్రం ఆగలేదు. మెగా ఫ్యాన్స్, బన్నీ ఆర్మీ మధ్య సోషల్ మీడియాలో ఫైట్ నడుస్తూనే ఉంది. అల్లు అర్జున్ వైసీపీ తరుపున క్యాంపైన్ చేయడంతో మెగా హీరోల మధ్య దూరం పెరిగిందనే ప్రచారం తెరపైకి వచ్చింది. దీనిని



కొద్దిరోజుల క్రితం బన్నీ వాస్ ఖండించారు. ఇదిలా ఉంటే తాజాగా నాగబాబు కూతురు నిహారిక ఓ ఇంటర్వ్యూలో ఈ వివాదంపై రియాక్ట్ అయ్యింది. అల్లు అర్జున్ వేరేవారికి క్యాంపైన్ చేయడంపై కుటుంబంలో ఏమైనా డిజప్పాయింట్ ఉందా అని జర్నలిస్ట్ ప్రశ్నించారు. కుటుంబంలో ఇలాంటి విషయాలు గురించి ఎక్కువగా మాట్లాడుకోమని నిహారిక తెలిపింది. అలాగే మా డాడీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఏవో ఒక పోస్టులు పెడుతూ ఉంటారు. అలాగే ఫ్యామిలీ వాట్సాప్ గ్రూప్ లో కూడా ప్రతి రోజు రకరకాల సూక్తులు పోస్ట్ చేస్తూ ఉంటారు. అలాగే ఆ రోజు ట్విట్టర్ ఆయన ఎందుకు అలా పోస్ట్ చేశారో అనేదానికి సరైన కారణాలు ఏంటనేది నాకు కూడా తెలియదు. ఇంట్లో మాత్రం ఆ అంశం మీద ఎలాంటి డిస్కషన్స్ రాలేదు. అలాగే ఇంట్లో ఎవరైనా ఒక పని చేశారంటే దానికి వారికంటూ సొంతం రీజన్స్ ఉంటాయి. ఏ విషయాన్ని అయిన వ్యక్తం చేయడానికి అలాగే నచ్చిన పని చేయడానికి ఎవరి ఛాయస్ వారికుంటుంది. వాటిని జడ్జ్ చేసే రైట్స్ ఎవరికి ఉండవు అని నిహారిక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఆమె మాటల బట్టి మెగా ఫ్యామిలీలో ఎవరి నిర్ణయాలు వారికుంటాయని, అయితే వాటిని ఇంకొకరి మీద రుద్దే ప్రయత్నం ఉండదని స్పష్టం అవుతోంది.

అలాగే ఆ విషయాల గురించి ఫ్యామిలీ గెట్ టు గెదర్ సమయాలలో అస్సలు చర్చించుకోరని కూడా తెలుస్తోంది.



# ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణ అమలు

హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు 27 ఏళ్లుగా పోరాటం చేశారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో శాసనసభలో సీఎం కీలక ప్రకటన చేశారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. "వర్గీకరణ కోసం గతంలో ఇదే శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. అప్పుడు నాతో పాటు సంపత్‌కుమార్‌ను సభ నుంచి బహిష్కరించారు. గత ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ అంశంపై ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పింది. అలా తీసుకెళ్లకుండా మాదిగ సోదరులను మోసం చేశారు. డిసెంబర్ 3, 2023న ప్రజాప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో శాసనసభ్యులు, అడ్వొకేట్ జనరల్ (ఏజీ)ను ఢిల్లీకి పంపించాం. న్యాయకోవిదులతో చర్చించి వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలమైన వాదనను కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు అనుకూలమైన తీర్పు ఇచ్చింది. సుప్రీం రాజ్యాంగ ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. దేశంలోనే అందరికంటే ముందు భాగాన నిలబడి ఏబీసీడీ వర్గీకరణ చేసే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేస్తాం. దీనికి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాదిగ సోదరులకు న్యాయం చేస్తాం. మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు సంపూర్ణంగా సహకరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను" అని సీఎం కోరారు.

## వర్గీకరణ పూర్తయ్యే వరకు నియామకాలు చేపట్టొద్దు: మందకృష్ణ మాదిగ



ఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాలకు ఉప వర్గీకరణ అధికారం ఉందని సుప్రీం తీర్పు ఇచ్చిందని చెప్పారు.

వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా పోరాటం చేస్తోందని.. ఎంతో మంది నేతలు ప్రాణాలు కోల్పోయారన్నారు. జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పోరాడామని వివరించారు. ఢిల్లీలో మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు.

**సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు** : "ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఎమ్మార్పీఎస్ నేతలకు ఈ విజయం అంకితం చేస్తున్నాం. ప్రక్రియ వేగవంతానికి చొరవ తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఏనాడైనా ధర్మమే గెలుస్తుందని 2004 నవంబర్ 5న చెప్పా. అధర్మం తాత్కాలికమైనా.. ధర్మమే గెలుస్తుందని చెప్పా. మాకు అనుకూలంగా తీర్పునిచ్చిన జడ్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు. ఉమ్మడి ఏపీలో ఎస్సీ వర్గీకరణ చేసింది సీఎం చంద్రబాబే. ప్రస్తుతం అనుకూల తీర్పు వచ్చిన సందర్భంలోనూ సీఎంగా ఉన్నది ఆయనే. ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఆయన వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు వచ్చేవి కావు. న్యాయం బతికిందంటే ఆరోజు చంద్రబాబు తీసుకొచ్చిన చట్టం వల్లే. వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా" అని మందకృష్ణ మాదిగ తెలిపారు.

## ముచ్చర్లలో స్కిల్ వర్సిటీకి శాశ్వత క్యాంపస్: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. దీని ద్వారా రాబోయే రోజుల్లో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. శాసనసభలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "2లక్షల ఉద్యోగాలు కల్పించినా.. మరో 20 లక్షల మంది ఉపాధి కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ప్రభుత్వ పరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదు. గ్రాడ్యుయేట్లలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు కొరవడ్డాయి. వారిలో స్కిల్స్ పెంపుపై పారిశ్రామిక వేత్తలు, వీసీలు, విద్యార్థులతో చర్చించాం. 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' స్థాపనకు ప్రతిపాదిస్తున్నాం. అన్ని కోర్సులు 50 శాతం ప్రాక్టికల్ కాంపోనెంట్ కలిగి ఉంటాయి. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. స్కిల్ యూనివర్సిటీ ఉపాధి కల్పిస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని పెంచుతుంది. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు ఊతమిస్తుంది. 2024-25 సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులకు.. వచ్చే ఏడాది 10వేల మందికి శిక్షణ ఇస్తాం. ముచ్చర్లలో స్కిల్ వర్సిటీ కోసం శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నాం" అని మంత్రి తెలిపారు.

## కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లుంది: ఎమ్మెల్యే సబిత

హైదరాబాద్: కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఎంతసేపూ కేసీఆర్‌ను తిట్టడం కాదు.. సమర్థ పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. శాసనసభలో తాను కనిపిస్తేనే.. సీఎం రేవంత్‌రెడ్డికి కంటగింపుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహిళల పట్ల సీఎం ప్రవర్తించిన తీరుపై విమర్శలు గుప్పించారు. సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని 4 గంటలు నిల్చున్నా కూడా మైక్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "మేం ఇప్పటి వరకు ఎంతోమంది సీఎంలను చూశాం.



వైఎస్ఆర్, చంద్రబాబు, కేసీఆర్ మహిళలకు సభలో ఎంతో గౌరవం ఇచ్చేవారు. మహిళలకు అవకాశం ఇవ్వాలని చెప్పేవారు. సభలో 9 మంది మహిళా సభ్యులున్నా.. మాట్లాడే అవకాశమే రావట్లేదు. ఎస్సీ వర్గీకరణపై మాట్లాడుదామనుకుంటే మైకు ఇవ్వలేదు. పార్టీ మారటం పెద్ద నేరమైతే.. ఇప్పుడు కాంగ్రెస్‌లోకి భారాస ఎమ్మెల్యేలు రాలేదా? రాహుల్ గాంధీ మిమ్మల్ని నమ్మితే మీరు ఆయన బతుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేస్తారా? నా వల్లే సీఎల్పీ పదవి పోయిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు ఎస్సీ నేతకు సీఎం పదవి ఇవ్వాలని ఆయన ఎందుకు అడగలేదు? సభలో లేని ఎమ్మెల్సీ కవిత గురించి ఎందుకు ప్రస్తావించాలి? ఆడబిడ్డ అయితే.. శత్రువు కుమార్తె అయినా జాలి చూపే సమాజం మనది. మమ్మల్ని అవమానించిన తీరును రాష్ట్రమంతా గమనించింది. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో మహిళలకు భద్రత కరువైంది"అని సబిత అన్నారు.

## నాకు మంత్రి పదవి వచ్చినప్పుడు టీఆర్ఎస్‌లోనే ఉన్నావ్.. రేవంత్‌పై హరీశ్ ధ్వజం

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలు ఈరోజు కూడా వాడివేడిగా జరిగాయి. సభలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై బీఆర్ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే అప్పట్లో హరీశ్‌రావు మంత్రి అయ్యారని సీఎం గుర్తుచేశారు. ఈ విషయంపై హరీశ్‌రావు కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అనాడు నాకు మంత్రి పదవి ఎవరి భిక్ష వల్లనో రాలేదు. శ్రీమతి సోనియా గాంధీ గారి కోరిక మేరకు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరాము తప్ప పదవుల కోసం కాదు. నాకు మంత్రి పదవి వచ్చినపుడు టీఆర్ఎస్‌లోనే ఉన్నావ్.. ఆ ఊరేగింపులోనూ ఉన్నావు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేసినప్పుడు కూడా నా వెనకే ఉన్నావ్, నిక్కి నిక్కి చూశావ్. ఇదంతా నీ కళ్ల ముందు జరిగిందే. కానీ ఇవేమి తెలియనట్లు చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నావు. పదవులు, విలువల గురించి మాట్లాడే హక్కు నీకెక్కడిది రేవంత్ రెడ్డి. తెలంగాణ ఉద్యమంలో పదవులను గడ్డి పోచలుగా త్యజించిన చరిత్ర మాది. పూటకో పార్టీ మారిన రాజకీయ చరిత్ర నీది. పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర నీది. ముఖ్యమంత్రి అయినప్పటికీ హుందాగా ప్రవర్తించడం లేదు. చీఫ్ మినిస్టర్‌గా కాకుండా, చిల్లరగా మాట్లాడే చీప్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నావు" అని హరీష్‌రావు సెటైర్లు గుప్పించారు.

## స్మితా సబర్వాల్‌ను తొలగించాలంటూ నిరసన



హైదరాబాద్: దివ్యాంగులను అవమానపరిచిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే విధుల్లో నుంచి తొలగించి ఆమెను అరెస్ట్ చేయాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా స్మితా సబర్వాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక నాయకులు జంగల్ శ్రీనివాస్, పి. శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, మల్లెల డేవిడ్, నరసింహారెడ్డి, మాధవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీ

## రేపు జాబ్ క్యాలెండర్ ప్రకటన

## నిఖత్ జరీన్, సిరాజ్‌కు ఇంటిస్థలం, గ్రూప్-1 ఉద్యోగం

## ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై మళ్లీ ప్రతిపాదనలు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కొత్త రేషన్ కార్డుల జారీ విధివిధానాల రూపకల్పనకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. "గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.437 కోట్లు విడుదలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అసెంబ్లీలో శుక్రవారం జాబ్ క్యాలెండర్ ప్రకటించబోతున్నాం. ఎన్నికల మేనిఫెస్టోలని అంశాలను తప్పక నెరవేరుస్తాం. క్రీడాకారులు ఈషాసింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌కు ఒక్కొక్కరికీ 600 గజాల చొప్పున హైదరాబాద్‌లో ఇంటి స్థలం, నిఖత్ జరీన్, సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ కుమారుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం, మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్-1 ఉద్యోగం. ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై గవర్నర్‌కు మళ్లీ ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించాం. కోదండరాంరెడ్డి, అమీర్ ఖాన్ పేర్లను మరోసారి గవర్నర్‌కు పంపిస్తాం. నిజాం చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు, హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ జంట జలాశయాలకు తరలిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు.

## మీర్‌ఖాన్‌పేటలో స్కిల్ యూనివర్సిటీ.. శంకుస్థాపన చేసిన సీఎం, డిప్యూటీ సీఎం



మీర్‌ఖాన్‌పేట: తెలంగాణలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 57 ఎకరాల్లో దీన్ని నిర్మించనున్నారు. వర్సిటీతోపాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ప్రైమరీ హెల్త్ సెంటర్‌లకు కూడా శంకుస్థాపన చేశారు.

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. దశాబ్దాలుగా వెనకకు నెట్టివేయబడ్డ ఎన్నో పేద కులాలకు ఈ చరిత్రాత్మక తీర్పు వల్ల ఇప్పుడైనా కొంత న్యాయం జరుగుతుందని ఆశిద్దాం అని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ రంగంలో అవకాశాలు సన్నగిల్లుతున్న ఈ తరుణంలో ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను ప్రవేశపెడితేనే పేద వర్గాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దక్షిణ భారత దేశంలో ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో ఈ విషయాన్ని తెరమీదికి తీసుకొచ్చి మూడు దశాబ్దాల పోరాటాన్ని నిర్మించిన కృష్ణ మాదిగకు, మిగతా ఉద్యమకారులందరికీ, ఈ అంశాన్ని సమర్థించిన అన్ని రాజకీయ పార్టీలకు అభినందనలు తెలుపుతున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## నిండుసభలో మహిళల పట్ల వారి వ్యాఖ్యలు అత్యంత అవమానకరం



హైదరాబాద్, ఆగస్టు 1: తెలంగాణ శాసనసభలో మహిళా నేతల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలు గాను వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. నిండు శాసనసభలో సీఎం, డిప్యూటీ సీఎంలు మహిళల పట్ల అత్యంత అవమానకరంగా ప్రవర్తించారని... వారి ప్రవర్తన తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. వెంటనే మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి సీఎం, డిప్యూటీ సీఎంలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఇద్దరూ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కూడా అని చెప్పుకొచ్చారు.

ఎంతో హుందాగా, ప్రజలకు సేవ చేసే గుణం వారిదన్నారు. అలాంటి మహిళ నేతలను ఇంత చులకనగా మాట్లాడటం సిగ్గు చేటని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు చేసిన ఈ వ్యాఖ్యలు వారిద్దరిపై మాత్రమే కాదు మొత్తం మహిళలపై వారికున్న చులకన భావాన్ని తెలియజేస్తోందన్నారు. కచ్చితంగా మహిళలంతా కాంగ్రెస్ నేతల వ్యవహార శైలిని గమనిస్తున్నారని.. వారికి సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు మహిళ సభ్యులపై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు కేటీఆర్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే..

**నిన్న సభలో ఏం జరిగిందంటే...** కాగా.. నిన్న(బుధవారం) తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో పెను దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. నిన్న ఉదయం ద్రవ్యవినిమయ బిల్లును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చర్చను మొదలు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలంటూ కేటీఆర్ డిమాండ్ చేస్తుండగా.. మధ్యలో రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు. "ప్రతిపక్ష సభ్యులు కలిసివస్తారనుకున్నాం. కానీ, ప్రతిపక్ష నేత సభకు రారు. కేటీఆర్‌కు సూచన చేస్తున్నా. వెనుక ఉన్న అక్కలు ఇక్కడ ముంచి అక్కడ తేలారు. వాళ్లను నమ్ముకుంటే జూబ్లీ బస్టాండులో కూర్చోవాల్సిందే" అని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక్కసారిగా గందరగోళానికి దారితీశాయి. తమను ఉద్దేశించే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కుర్చీల్లోంచి లేచి నిరసన తెలిపారు. వెల్‌లోకి దూసుకొచ్చి పోడియంను చుట్టుముట్టారు.

ఒకానొక సందర్భంలో మాజీ మంత్రి సబిత కంటతడి పెట్టారు. తనను ఎందుకు టార్గెట్ చేశారని ప్రశ్నించారు. "ఓ అక్కగా కాంగ్రెస్‌లోకి రా తమ్ముడూ అని రేవంత్‌ను ఆహ్వానించానని, కాంగ్రెస్‌లో ఆశాకిరణం అవుతావని, సీఎం అవుతావని ఆశీర్వదించాను" అని సబిత తెలిపారు. దీంతో సీఎం రేవంత్ మళ్లీ కల్పించుకుంటూ.. తనను మోసం చేసిన సబితక్కతో జాగ్రత్తగా ఉండాల్సిందిగా కేటీఆర్‌కు సూచన చేశానని అన్నారు. "సబితక్క నన్ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన మాట వాస్తవం. 2019లో మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నన్ను కోరింది. అక్కడి నుంచి పోటీ చేస్తే అండగా ఉంటానని సబితక్క నాకు మాట ఇచ్చారు. కానీ, కాంగ్రెస్ పార్టీ నన్ను అభ్యర్థిగా ప్రకటించగానే.. ఆమె బీఆర్ఎస్‌లోకి వెళ్లి మంత్రి పదవి పొందారు" రేవంత్ అన్నారు. అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా బీఆర్ఎస్‌పై ఎదురు దాడికి దిగారు. 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ సబితా ఇంద్రారెడ్డికి అనేక పదవులు ఇచ్చింది. కానీ.. సబితా ఇంద్రారెడ్డి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరి మోసం చేశారు. ఒక దశాబ్ద కాలం సబితకు మంత్రి పదవి ఇచ్చాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుంటే సబిత బీఆర్ఎస్‌లోకి వెళ్ళారు. కాంగ్రెస్ నన్ను సీఎల్పీ లీడర్ చేస్తే నా వెనక ఉండాల్సింది పోయి పదవి కోసం సబిత పార్టీ మారారు" అంటూ భట్టి విమర్శలు గుప్పించారు. సీఎం, డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. అయితే సభ్యుల ఆందోళనల మధ్యే ద్రవ్యవినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

## గోప్యంగా సమాచారం.. వ్యక్తిగత వివరాలు అవసరం లేదు



హైదరాబాద్ : జీఐఎస్ సర్వేలో పౌరుల నుంచి సేకరిస్తున్న భవనాలు, నీటి, విద్యుత్‌బిల్లుల సమాచారం గోప్యంగా ఉంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. ఆధార్ నంబర్, వ్యక్తిగత వివరాలు సిబ్బంది తీసుకోరని సిబ్బంది అడిగినా ఇవ్వొద్దని పేర్కొన్నారు.

ఆస్తుల నిర్వహణ, యుటిలిటీ మ్యాపింగ్ కోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో భాగంగా డిజిటల్ డోర్ నంబర్లు కేటాయిస్తున్నామని, దీనికోసం సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. జీఐఎస్ సర్వే ద్వారా అన్ని ప్రాపర్టీలను జియో ట్యాగ్ చేసి ప్రతి ఆస్తికి ఒక ప్రత్యేక సీక్వెన్షియల్ నంబర్ కేటాయిస్తామన్నారు. పలు ప్రాంతాల్లో బుధవారం సర్వే నిర్వహించిన అధికారులు ప్రజలనుంచి వివరాలు సేకరించారు. సర్వేపూర్తిగా యుటిలిటీ మ్యాపింగ్, అసెట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెడుతుందన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com